# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :129 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: బుధవారం 23-07-2025 పేజీలు:4 వెల: 2.00


## విచారణకు రావాలని ఆదేశించి ఇడి

హైదరాబాద్, బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ అధికారులు సినీ సెలబ్రిటీలకు షాక్ ఇచ్చారు. ఈ కేసులో ముమ్మరంగా విచారణ చేస్తున్న క్రమంలో బెట్టింగ్ యాప్ కేసులో నిందితులుగా ఉన్న సినీ సెలబ్రిటీలకు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే పలువురిని పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దగ్గుబాటి రానా, ప్రకాష్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మీప్రసన్న విచారణకి హాజరవ్వాలని ఈడీ అధికారులు నోటీసులు పంపించారు. జులై 23న దగ్గుబాటి రానా, జులై30న ప్రకాష్‌రాజ్, ఆగస్ట్6న విజయ్ దేవరకొండ, ఆగస్ట్ 13న మంచు లక్ష్మీప్రసన్న విచారణకి హాజరవ్వాలని నోటీసులో తెలిపారు. విదేశీ బెట్టింగ్ యాప్‌లను వీరు ప్రమోట్ చేసినట్లు- ఈడీ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో వీరిని మనీ లాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు విచారణ చేయనున్నట్లు- తెలుస్తోంది. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినందుకు ఆయా కంపెనీల నుంచి సినీ సెలబ్రిటీలకు నగదు ఎక్కడి నుంచి వచ్చిందనే విషయంపై విచారణ చేయనున్నారు. ఇప్పటికే హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులు వీరిపై కేసులు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ అధికారులు కేసు నమోదు చేశారు.


## బిల్లులపై రాష్ట్రపతికి డెడ్‌లైన్ విధించవచ్చా?



న్యూఢిల్లీ,చట్టసభల్లో ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి పెండింగ్‌లో పెడుతున్నారు. దీంతో ఈ వివాదం బాగా ముదురుతోంది. ఇటీవల తమిళనాడు గవర్నర్-రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఇలాంటి రగడే జరిగింది. దీంతో దేశ సర్వోన్నత న్యాయస్థానం.. తమిళనాడు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. నిర్దిష్ట గడువులోగా ఆమోదించకపోతే.. ఆ బిల్లులు ఆమోదం పొందినట్లేనని స్పష్టం చేసింది. తాజాగా ఇదే అంశంపై మంగళవారం సుప్రీకోర్టు విచారణ చేపట్టింది. చట్టసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా ఆమోదించాలంటూ కోర్టులు నిర్దేశించవచ్చా అనే అంశంపై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. దీనిపై అభిప్రాయాలు తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం ఈ విచారణను చేపట్టింది. వచ్చే మంగళవారం నాటికి దీనిపై స్పందన తెలియజేయాలని సూచించింది. ఇది ఒక రాష్ట్రానికి సంబంధించిన విషయం మాత్రమే కాదని, దేశానికి సంబంధించిన విషయమని గమనించాలని పేర్కొంది.

## ధన్‌ఖడ్ రాజీనామా.. ప్రధాని మోదీ స్పందన..

న్యూఢిల్లీ, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం రాత్రి రాజీనామా లేఖను రాష్ట్రపతికి పంపారు. ఆయన రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తాజాగా ఆమోదించారు. ఈ నేపథ్యంలో ఉపరాష్ట్రపతి రాజీనామాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. ఉపరాష్ట్రపతి సహా వివిధ హోదాల్లో దేశానికి సేవ చేసేందుకు ధన్‌ఖడ్‌కు అనేక అవకాశాలు లభించాయన్నారు. ఆయన మంచి ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 67(ఏ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మరో రెండేండ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. 2022లో ఎన్డీయే తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేట్ కావడంతో ఆయన బెంగాల్



గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. విపక్ష అభ్యర్థి మార్గరేట్ అల్వాపై విజయం సాధించి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 710 ఓట్లకుగాను 528 ఓట్లు గెలుచుకుని 1997 తర్వాత అత్యధిక ఓట్లతో ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన మూడో వ్యక్తి ధన్‌ఖడ్. అంతకుముందు 1969లో రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు వీవీ గిరి, 1987లో రాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో ఆర్ వెంకటరామన్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. కానీ అలాంటిదేమీ లేకుండానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం ఢిల్లీ రాజకీయాలలో ఆసక్తికరంగా మారింది.

## కేసీఆర్‌కు పేరు వస్తుందనే కిట్లను ఇవ్వడం లేదు : కేటీఆర్

హైదరాబాద్, కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందన్న ఉక్రోశంతోనే రేవంత్ ప్రభుత్వం కేసీఆర్ కిట్లను ఇవ్వడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన కేసీఆర్ కిట్లతో మాతా శిశు మరణాలు గణనీయంగా తగ్గి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగాయని తెలిపారు. తన పుట్టిన రోజు సందర్భంగా కేసీఆర్ కిట్లను ఇస్తానని ప్రకటించిన కేటీఆర్.. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన తల్లీబిడ్డలకు తెలంగాణ భవన్‌లో కేసీఆర్ కిట్లను అందించారు. గత 20 నెలల నుంచి కేసీఆర్ కిట్లను ఇవ్వకపోవడంతో చాలా మంది తల్లులు బాధపడుతున్నారని కేటీఆర్ చెప్పారు. అందుకే తన పుట్టిన రోజు సందర్భంగా 5 వేల మంది తల్లులకు సిరిసిల్లలో కేసీఆర్ కిట్లను ఇవ్వనున్నట్లు తెలిపారు. 2014 కు ముందు నేను రాను బిడ్డో సర్కారు దవఖానాకు అని జనాలు భయపడేవారన్న కేటీఆర్.. ముఖ్యమంత్రిగా కేసీఆర్ తీసుకున్న చర్యలతో సర్కార్ దవాఖానాకే పోవాలని జనాలంతా అనుకున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలను మార్చిన కేసీఆర్



కిట్లను గత 20 నెలల నుంచి రేవంత్ సర్కార్ ఇవ్వకపోవడం దుర్మార్గం అన్నారు. కేసీఆర్ మీద ఉన్న అంతులేని ద్వేషం, కోపమే ఇందుకు కారణమని విమర్శించారు.

## ధన్‌ఖడ్ రాజీనామా వెనుక లోతైన కారణం ఉండొచ్చు : జైరాం రమేష్



న్యూఢిల్లీ, దేశ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఉదయం నుంచి ఎగువసభను సజావుగా నడిపించిన ఆయన రాత్రికి తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ముర్ముకు పంపారు. దీంతో ఆయన రాజీనామాపై ప్రస్తుతం తీవ్రంగా చర్చ నడుస్తోంది. అనారోగ్య కారణాలతో పదవి నుంచి దిగిపోతున్నట్లు ధన్‌ఖడ్ చెప్పినప్పటికీ.. ఆయన రాజీనామాపై ప్రతిపక్ష పార్టీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఏదో లోతైన కారణం ఉండొచ్చని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. సోమవారం మధ్యాహ్నం 12:30 గంటలకు బిజినెస్ అడ్వైజరీ కమిటీకి ధన్‌ఖడ్ అధ్యక్షత వహించినట్లు చెప్పారు. జేపీ నడ్డా, కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు సహా పలువురు హాజరైనట్లు తెలిపారు. చర్చ అనంతరం మళ్లీ సాయంత్రం 4:30 గంటలకు సమావేశం కావాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అయితే, మరోసారి భేటీకి నడ్డా, రిజుజు రాలేదని.. దీంతో సమావేశాన్ని మంగళవారం మధ్యాహ్నానికి వాయిదా వేసినట్లు చెప్పారు. ఇంతలోనే ఆయన అనూహ్యంగా రాజీనామా చేశారన్నారు. నిన్న మధ్యాహ్నం 1 గంట నుంచి 4:30 గంటల మధ్య ఏదో పెద్ద విషయమే జరిగిందని అనుమానం వ్యక్తం చేశారు. నడ్డా, రిజుజు ఉద్దేశపూర్వకంగానే ఆ సమావేశానికి హాజరు కాలేదని అన్నారు. ఈ క్రమంలోనే ధన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతికి పంపినట్లు చెప్పారు. ఆరోగ్య కారణాలతోనే పదవి నుంచి దిగిపోతున్నట్లు చెప్పారని.. దాన్ని మనం గౌరవించాలని జైరాం రమేష్ వ్యాఖ్యానించారు. ఏది ఏమైనా ఆయన రాజీనామా వెనుక ఏదో లోతైన కారణమే ఉందని అనుమానం వ్యక్తం చేశారు

## మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం



మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ఏనుగొండ, రామదూత టౌన్‌షిప్ కాలనీలో ముడా నిధులు రూ.25 లక్షలతో నిర్మించనున్న అధునాతన పార్క్ నిర్మాణపు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ మున్సిపాలిటీగా ఉన్న మహబూబ్‌నగర్‌ను కార్పొరేషన్‌గా రూపాంతరం చేయడం జరిగిందని, నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవడం ఎంతో అవసరమన్నారు. అందుకే నగరంలో అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. మార్పు ఇప్పుడే మొదలైందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, నాయకులు సిజే బెనహర్, వెంకటేష్ గౌడ్, రామస్వామి, కిరణ్ కుమార్, ఇమ్మడి పురుషోత్తం, సిహెచ్ మంజుల, సీహెచ్ జ్యోతి, రఘురామిరెడ్డి, మురళీ గౌడ్, వెంకటయ్య , రమేష్, సీఎంఓ బాలు యాదవ్, రవికుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు కలల ప్రాజెక్టు.. రేవంత్ ఫ్యూచర్ ప్లాన్..

హైదరాబాద్,రెండు తెలుగు రాష్ట్రాల్లో ఓ భారీ ప్రాజెక్టుకు కేంద్రం పచ్చజెండా ఊపిందా? అంటే ఔననే సమాధానం వినిపిస్తోంది. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను గమనిస్తే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఉమ్మడిగా కేంద్రం నుంచి భారీ ప్రాజెక్టును సాధించారని అంటున్నారు. ఇప్పటికే చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య సంబంధాలపై అనేక ప్రచారాలు ఉన్నాయి. తాజా విజయంతో వారి బంధం సుస్థిరమవ్వనుందని అంటున్నారు. ఇంతకీ గురుశిష్యులుగా ప్రతిపక్షాలు ప్రచారం చేసే చంద్రబాబు.. రేవంత్ రెడ్డి ఏం సాధించారన్న విషయానికి ఇప్పుడు వద్దాం..తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనతో తన ముద్ర వేసేందుకు ఫ్యూచర్ సిటీని ప్రతిపాదిస్తున్న విషయం తెలిసిందే. జంట నగరాలుగా అభివృద్ధి చెందిన హైదరాబాద్, సికింద్రాబాద్ ఆ తర్వాత సైబరాబాద్ నిర్మాణంతో విశ్వనగరంగా ఎదిగింది. ఇక నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీకి రూపకల్పన చేస్తున్నారు. ఇప్పటికే ఆ దిశగా ఒడిఒడి అడుగులు వేస్తున్నారు. మరోవైపు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కలల ప్రాజెక్టు రాజధాని అమరావతి. విశ్వనగరంగా నిర్మిస్తున్న అమరావతికి మిగిలిన ప్రాంతాలతో కనెక్టివిటీ ఉండేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళిక రచిస్తున్నారు. రోడ్డు, రైలు, వాయు మార్గాలపై ఇప్పటికే ప్రతిపాదనలు అనుమతులు సాధిస్తున్నారు. అయితే ఇప్పుడు కనెక్టివిటీని మరింత సౌలభ్యంగా తీర్చిదిద్దేందుకు గాను అమరావతికి హైస్పీడ్ రైలు కారిడార్ వేయాలని చంద్రబాబు భావిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతికి హైస్పీడు రైలు మార్గం వేయాలని నిర్ణయించి కేంద్రం అనుమతి కూడా తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర విభజన



సమయంలోనే అమరావతికి రైల్వేలైనుపై హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే ఈ హామీని హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి ఉపయోగించుకోవాలని ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులు భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఢిల్లీ పర్యటన సందర్భంగా ఈ ప్రతిపాదన చర్చకు వచ్చినట్లు తాజాగా వెల్లడైంది. కేంద్ర రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసినప్పుడు ఈ ప్రస్తావన వచ్చిందని, దీనిపై సానుకూల స్పందన వచ్చినట్లు చెబుతున్నారు. అంతేకాకుండా ఫ్యూచర్ సిటీ - అమరావతిని కలిపే ఎక్స్‌ప్రెస్ వే రూట్ మ్యాప్ ఖరారుకు ఓ కంపెనీకి బాధ్యతలు అప్పగించారని కూడా తెలుస్తోంది. ఈ ఎక్స్‌ప్రెస్ వే అందుబాటులోకి వస్తే ఇరు రాష్ట్రాల ఆర్థిక వృద్ధి మరింత వేగవంతం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయని అంటున్నారు.

## రెండో రోజూ అదే రగడ .. ఆపరేషన్ సిందూర్ పై చర్చకు విపక్షాల పట్టు

న్యూఢిల్లీ : లోక్‌సభ, రాజ్యసభలో నేడు ప్రారంభమైన కొన్ని నిమిషాల వ్యవధిలోనే వాయిదా పడ్డాయి.. ముందుగా మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడగా, ఆ తర్వాత కూడా విపక్షాల నిరసనలు కొనసాగడంతో ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు.. కాగా స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన నేడు ప్రారంభమైన లోక్‌సభ ప్రారంభమైన నిమిషాల్లోనే విపక్ష సభ్యుల ఆందోళన వాయిదా తీర్మానాలు చర్చించాలని పట్టు పట్టారు..కాంగ్రెస్ సహా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ, ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళనలు చేయడంతో, దిగువ సభ కార్యకలాపాలలను తొలుత మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. అయితే తిరిగి సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు నిరసనలు కొనసాగించడంతో, స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు . తిరిగి సమావేశమైన ఉభయ సభలలో విపక్షాలు మెట్టు దిగకపోవడంతో రేపటికి సభ కార్యక్రమాలను వాయిదా వేశారు.

### రాజ్యసభలోనూ సేమ్ సీన్ .

ప్రతిపక్ష పార్టీల ఆందోళనల మధ్య రాజ్యసభ కార్యకలాపాలు మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా పడ్డాయి. రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ సోమవారం రాత్రి ఆకస్మిక రాజీనామా చేయడంపై ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్య ఎగువ సభ ఉదయం కార్యకలాపాలు మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడ్డాయి. తరువాత కూడా నిరసనలు కొనసాగడంతో మధ్యాహ్నం 2 గంటల వరకూ వాయిదా వేశారు. డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సమావేశాలకు అధ్యక్షత వహించారు. ధన్‌ఖడ్ రాజీనామా, బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ అంశాలపై చర్చ చేపట్టడానికి ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా నోటీసులను హరివంశ్ తిరస్కరించారు. దీంతో సభ్యులు సభలోనే ఆందోళన చేపట్టారు..

### నిన్న కూడా..

తొలిరోజున ప్రతిపక్షాలు.. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు డిమాండ్ చేయడంతో ఉభయ సభలు వాయిదా పడిన సంగతి తెలిసిందే. తొలిరోజు నిరసనల మధ్యనే రాజ్యసభ.. షిప్పింగ్ డాక్యుమెంటేషన్ చట్టాలను ఆధునీకరించే లాడింగ్ బిల్లును విజయవంతంగా ఆమోదించింది . హైకోర్టు



న్యాయమూర్తి యశ్వంత్ సిన్హాపై మోపిన అభిశంసనపై రాజ్యసభలో ప్రసంగించిన అనంతరం ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ తన పదవికి రాజీనామా చేశారు.

### నెల రోజులు వర్షాకాల సమావేశాలు

జూలై 21న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 21 వరకు జరగనున్నాయి. ఆగస్టు 12 నుండి ఆగస్టు 17 వరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల విరామం ఉంటుంది. ఆగస్టు 18న తిరిగి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఇదిలా ఉండగా తాజాగా జస్టిస్ యశ్వంత్ వర్మపై మోపిన అభిశంసన తీర్మానంపై ఐయూఎంఎల్ ఎంపీ ఈటీ మహమ్మద్ బషీర్ మాట్లాడుతూ, ఈ అభిశంసన చాలా ముఖ్యమైనది. ఆ న్యాయమూర్తి వ్యవహారాల కారణంగా భారత న్యాయవ్యవస్థ స్థితి మరింత దిగజారింది. అందుకే తాము దీనిపై మెమోరాండంను స్పీకర్‌కు సమర్పించామన్నారు. ప్రభుత్వం దీనిపై స్పందిస్తుందని ఆశిస్తున్నామని బషీర్ పేర్కొన్నారు.

### పార్లమెంట్ ఆవరణలో విపక్షాల నిరసనల హోరు.

బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ పేరుతో ఓటర్ల జాబితాను సవరించడానికి వ్యతిరేకంగా పార్లమెంట్ భవనం ఆవరణలో ప్రతిపక్ష ఎంపీలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. లోక్‌సభ లో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ , సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ సహా ప్రతిపక్ష ఎంపీలంతా ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎంపీలు నినాదాలు చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ పేరుతో ఎన్నికల సంఘం అధికార బీజేపీ వ్యతిరేక ఓటర్లను జాబితా నుంచి తొలగించిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

## రాహుల్‌గాంధీ మేధావి అంటూ పప్పు యాదవ్ ప్రశంసలు



పాట్నా:కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై పూర్ణియా ఎంపీ పప్పు యాదవ్ ప్రశంసల వర్షం కురిపించారు. రాహుల్‌గాంధీ మేధావి అని.. యూపీఏ-2లో మన్మోహన్ సింగ్..పదని పదవిని ఆఫర్ చేస్తే రాహుల్ గాంధీ కొన్ని సెకన్లలోనే తిరస్కరించారని గుర్తు చేశారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదివిన మేధావి కాబట్టే ప్రధానమంత్రి కుర్చీని తిరస్కరించారన్నారు. 10,000 కిలోమీటర్లు నడిచి ప్రధానమంత్రి కుర్చీని తిరస్కరించడం మామూలు విషయం కాదన్నారు. రాహుల్ గాంధీ న్యాయ సూత్రాన్ని నమ్ముతారని చెప్పారు. ఇక మోడీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మోడీ బలహీనమైన ప్రధాని అన్నారు. మోడీకి 56 అంగుళాల ఛాతీ కాదని.. 5 అంగుళాల ఛాతీనే ఉందని ప్రజలకు తెలుసన్నారు. ప్రపంచం మనల్ని ఎగతాళి చేస్తోందని.. ఇంత బలహీనమైన ప్రధానమంత్రిని తాను ఎప్పుడూ చూడలేదన్నారు. రాజ్యాంగ మరియు ప్రజాస్వామ్య హక్కులు హరించబడుతున్నాయని ఆరోపించారు. ప్రతిపక్షాలు లేవనెత్తే ఆందోళనలను పరిష్కరించకపోతే సభ పనిచేయదని హెచ్చరించారు. బీహార్‌లో ఉద్దేశపూర్వకంగానే ఓట్లు తొలగిస్తున్నారని.. ఎన్నికల సంఘం అధికార పార్టీకి తొత్తుగా మారిందని వ్యాఖ్యానించారు. పప్పు యాదవ్ ఆరుసార్లు ఎంపీగా గెలిచారు. గత లోక్‌సభ ఎన్నికల్లో బీహార్‌లోని పూర్ణియా నుంచి స్వతంత్ర ఎంపీ అభ్యర్థిగా గెలిచారు. కాంగ్రెస్ టికెట్ నిరాకరించింది. ఆ స్థానాన్ని కూటమి భాగస్వామి ఆర్జేడీకి ఇచ్చింది. దీంతో పప్పు యాదవ్ ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగి విజయం సాధించారు.

## సంపాదకీయం

బుధవారం 23-07-2025

# ఎవరి వాదనలు వారివే

ఉరుములూ మెరుపులతో కూడిన వర్షాకాల సమావేశాలకు పార్లమెంటు నేటి నుంచి వేదిక కాబోతోంది. ఈ భేటీలను నెలరోజులపాటు నిర్వహించేందుకు రాష్ట్రపతి సమన్లు జారీచేసినా వాస్తవంగా సభ సమావేశమయ్యేది 21 రోజులే. ఇందులోనే ఎత్తులుపైఎత్తులు వేస్తూ అవతలివారిపై పైచెయ్యి సాధించేందుకు అధికార, ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత జరుగుతున్న తొలి పార్లమెంట్ సమావేశాలు ఇవే. దేశాన్ని కుదిపేసిన ఆ పైశాచికకాండను ప్రస్తావిస్తూ అధికారపక్షాన్ని ఇరుకునపెట్టాలని ప్రతిపక్ష 'ఇండియా' కూటమి భావిస్తోంది. దాన్నే సానుకూలంగా మలుచుకుని ఉగ్రవాదంపై సాధించిన విజయాలను చాటిచెప్పాలని ఎన్డీయే కూటమి ఉవ్విళ్లూరుతోంది. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్, దాన్ని ఆపడంలో అమెరికా అధ్యక్షుడి జోక్యం, బిహార్‌లో మొదలుపెట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలనలపై ఈ వర్షాకాల భేటీల్లో వాదోపవాదాలు జరగవచ్చు. నోట్లకట్టలు బయటపడిన కేసులో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మ అభిశంసన, జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరణ, పంటలకు కనీస మద్దతుధరలకు చట్టబద్ధతలపైనా వాడీవేడిగా చర్చలు జరగవచ్చు. ఎయిర్ ఇండియా విమాన దుర్ఘటన, దానిపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రాథమిక దర్యాప్తు నివేదిక, జనగణన, కులగణన లాంటి అంశాలపైనా ఈ సమావేశాల్లో విమర్శలు ప్రతివిమర్శలు రేగవచ్చు. ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భం, అక్రమాస్తుల కేసులో రాబర్ట్‌వాద్రాపై ఈడీ ఛార్జిషీట్ దాఖలుచేసిన అంశాలను అస్త్రాలుగా చేసుకుని ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేయడానికి అధికారపక్షం సంసిద్ధమవుతోంది.

అన్నీ కీలకాంశాలే...

కేంద్ర ఎన్నికల సంఘం బిహార్‌లో మొదలుపెట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పరిశీలన ప్రస్తుతం ఉత్తర భారతదేశంలో ప్రధాన రాజకీయ అంశంగా మారింది. ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా విస్తరిస్తామని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. పార్లమెంటులో భాజపా తర్వాత అతిపెద్ద పార్టీలైన కాంగ్రెస్, సమాజ్‌వాదీపార్టీ, తృణమూల్‌కాంగ్రెస్, డీఎంకేలు దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. వచ్చే నవంబర్‌లో జరిగే బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు పార్టీశ్రేణులను సమాయత్తం చేయడానికి అక్కడి రాజకీయ పార్టీలన్నీ ఇప్పటికే ఈ అంశాన్ని ఆయుధంగా చేసుకుని క్షేత్రస్థాయిలో యుద్ధం మొదలుపెట్టాయి. అందువల్ల అది పార్లమెంటులోనూ అలజడి సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతోపాటు పహల్గాంలో భద్రతా దళాల నిఘా వైఫల్యం కారణంగానే ఉగ్రవాద దాడి జరిగినట్టు ప్రతిపక్షాలు మొదటి నుంచీ ఆరోపిస్తున్నాయి. హోంమంత్రి అమిత్‌షా నేతృత్వంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలోనూ దీని గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. ఇప్పుడు అదే అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావించి ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితులను సృష్టించడానికి అవి ప్రయత్నించనున్నాయి. పహల్గాం మారణకాండపై ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు పురోగతి, అరెస్టులు, భారత్-పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణలో అమెరికా జోక్యం గురించి నిలదీయడానికి సిద్ధమవుతున్నాయి. ఇది సభలో ఉద్రిక్తతలకు దారితీయవచ్చు. మరోవైపు జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన అంశమూ రాజకీయ దుమారాన్ని రేపే అవకాశం ఉంది. ప్రతిపక్షాలు ఈయన అభిశంసనకు మద్దతిస్తూనే- విద్వేష ప్రసంగం చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ యాదవ్ తొలగింపునకూ పట్టుబడుతున్నాయి. దానిపై ఇప్పటికే 54 మంది విపక్ష ఎంపీలు రాజ్యసభ ఛైర్మన్‌కు అభిశంసన నోటీసు కూడా ఇచ్చారు. వారిలో 44 మంది సంతకాలను రాజ్యసభ సచివాలయం రూఢీ చేసుకుంది కూడా. అందువల్ల ముందుగా నోటీసు ఇచ్చిన జస్టిస్ యాదవ్ సంగతి తేల్చిన తర్వాతే జస్టిస్ యశ్వంత్‌వర్మ అభిశంసనకు వెళ్లాలని ప్రతిపక్షాలు భీష్మించవచ్చు.

ప్రతి దాడికి సిద్ధం!

స్వతంత్ర భారతంలో జరిగిన అతిపెద్ద విమాన ప్రమాదాల్లో ఒకటైన ఎయిర్ ఇండియా-171 దుర్ఘటనపైనా ప్రత్యేక చర్చకోసం విపక్షాలు పట్టుబట్టవచ్చు. 261 మంది ప్రాణాలను బలిగొన్న ఈ ప్రమాదానికి సంబంధించిన నివేదికపై ప్రతిపక్షాలు అనేక అనుమానాలను లేవనెత్తుతున్నాయి. అర్ధరాత్రి 1.30 గంటలకు నివేదిక విడుదల చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? దానిపై అధికారుల సంతకం ఎందుకు లేదు? దర్యాప్తు బృందంలో పైలెట్లకు ఎందుకు చోటు కల్పించలేదు? ప్రాథమిక విచారణాంశాలు విదేశీవర్గాలకు ముందే ఎలా లీక్ అయ్యాయి? కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లోని కేవలం ఒక అసందిగ్ధమైన వ్యాఖ్యను మాత్రమే ఎందుకు విడుదల చేయాల్సి వచ్చిందన్న ప్రశ్నలను విపక్షాలు సంధిస్తున్నాయి. ప్రతిపక్షాల దాడికి విరుగుడుగా 50 ఏళ్ల ఎమర్జెన్సీని అధికారపక్షం ముందుకు తెస్తోంది. దానిపై ప్రత్యేకంగా చర్చ చేపట్టి, కాంగ్రెస్‌ను మిగిలిన పక్షాల నుంచి ఏకాకిని చేసే వ్యూహ్యానికి పదునుపెడుతోంది. ఎమర్జెన్సీని కాంగ్రెస్ మిత్రపక్షాలు కూడా సమర్థించే అవకాశం లేదు కాబట్టి ప్రధాన ప్రతిపక్షాన్ని సభలో దాదాపు ఒంటరిని చేసి తాను పైచేయి సాధించాలని చూస్తోంది.

మింగలేక కక్కలేక...

వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం 16 కొత్త బిల్లులు ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతోంది. ఇందులో వేటికీ పెద్దగా రాజకీయ ప్రాధాన్యం లేదు. అయితే గత ఫిబ్రవరిలో మణిపుర్‌లో విధించిన రాష్ట్రపతి పాలన కొనసాగింపునకు ఈసారి సభామోదం పొందాల్సి ఉంది. ఆ సమయంలో అక్కడి పరిస్థితులపై తీవ్రమైన చర్చ జరగవచ్చు. రాష్ట్రపతి పాలన విధించిన అనంతరం ఆ రాష్ట్రంలో జరిగిన జాతుల ఘర్షణలో అయిదుగురు చనిపోయారు. అయితే రాష్ట్రపతి పాలన అనంతరం మొత్తంగా అక్కడ హింసాత్మక ఘటనలు తగ్గి శాంతిభద్రతలు మెరుగుపడ్డాయి. అక్కడక్కడా చెదురుమదురు సంఘటనల్లో భద్రతాదళాలకు సవాళ్లు ఎదురవుతున్నా, శాంతి నెలకొల్పే ప్రయత్నాలైతే జరుగుతున్నాయి. కాబట్టి మణిపుర్ పరిస్థితులపై అధికార, విపక్షాలు తమకు అనుకూలమైన వాదనలను వినిపించే వీలుంది. ఇక కీలక సమావేశాల వేళ 'ఇండియా' కూటమి నుంచి వైదొలుగుతున్నట్లు 'ఆప్' ప్రకటిస్తే- తిరువనంతపురం కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ స్వపక్షానికి విపక్షంగా తయారయ్యారు. ప్రతిపక్షానికి ఇవి కాస్త కొరుకుడుపడని అంశాలు. అటు ఆప్, ఇటు శశిథరూర్‌లు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడితే- మొత్తం ప్రతిపక్షం గొంతులో పచ్చివెలక్కాయ పడుతు ంది. ఇదే సమయంలో అధికార కూటమిలోని అన్ని పార్టీలూ ప్రతి విషయంలో నూ ఏకతాటిపై నిలుస్తూ, మద్దతు పలుకుతుండటం ప్రభుత్వ బలాన్ని పెంచుతోంది.

# విపక్షంగా విఫలం అవుతోన్న కాంగ్రెస్!

న్యూఢిల్లీ,పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. యథావిధిగానే వాయిదాలతో సమావేశాలు స్వాగతం పలికాయి. ప్రతి సమావేశంలోనూ ఇలాగే జరుగుతోంది. పార్లమెంట్ ప్రజల కోసం ఉద్దేశించిందిన్న ఇంగితం అధికార, విపక్షాలకు ఉండడం లేదు. మొక్కుబడిగా సమావేశాలకు హాజరు కావడం, బత్తా పుచ్చుకోవడం, ప్రజల నెత్తిన పన్నులు రుద్దడం అన్న తంతు కొన్నేళ్లుగా సాగుతోంది. నిజంగానే మనం ప్రజలకు న్యాయం చేస్తున్నామా అన్న ఆలోచన ఏ నాయకుడూ చేయడంలేదు. తొలిరోజే వాయిదా తీర్మానాలు ఇవ్వడం, గొడవ చేయడం వంటి చర్యలు ఈ సమావేశాల్లోనూ కనిపించాయి. దీంతో వాయిదాతో స్పీకర్ ఓం బిర్లా సమావేశాలకు శ్రీకారం చుట్టారు. గొడవ చేస్తేనే ప్రతిపక్షం అన్న రూఢి నాటుకుపోయింది. ఓ రకంగా చెప్పాలంటే ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ ఎప్పుడూ విఫలం అవుతూనే ఉంది. పార్లమెంటులో సమస్యలపై చర్చించేందుకు కొన్ని పద్దతులు ,రూల్స్ ఉన్నాయి. ఏ సమస్యనైనా చర్చించి, జవాబు రాబట్టడం ద్వారా ప్రభుత్వాన్ని నిలదీయవచ్చు. కానీ కాంగ్రెస్ అలా చేయడం లేదు. ఇండియా కూటమిగా జట్టు కట్టినా పార్లమెంట్ అంటే అధికార బిజెపికి భయం లేకుండా పోతోంది. ఎందు కంటే బలహీనమైన ప్రతిపక్షం, పేలవమైన తీరు కారణంఅని చెప్పవచ్చు. పార్లమెంట్ సమావేశాలు ఆగస్ట్ 21 వరకు అంటే దాదాపు నెలరోజుల పాటు కొనసాగనున్నాయి. ఆగస్టు12 నుంచి 18 వరకు సమావేశాలకు సెలవులు ఉంటాయి. ఈ సమావేశాల్లో మొత్తం 7 పెండింగ్ బిల్లులతో పాటు మరో 8 బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. ఇక, దేశ భద్రతకు సంబంధించిన పలు కీలక విషయాలను పార్లమెంటులో చర్చించాలని ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ వంటి వాటిపై చర్చించాలని ఇండియా కూటమి పట్టుపట్టాలని కోరుకుంటోంది. తానే యుద్ధం ఆపించానని ట్రంప్ పదేపదే చెప్పడం, దేశ ఆంతరంగిక విషయాలలో ప్రమేయం అయిందని కాంగ్రెస్ విమర్శిస్తోంది. ట్రంప్ వ్యాఖ్యలపై మోడీ పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని, ఇంతకు అమెరికా పట్ల ఎటువంటి వైఖరి ఉందనేది తెలియచేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేయనున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాలు వాడీ వేడీగా జరగ నున్నాయి. అయితే, ఆపరేషన్ సింధూర్‌పై చర్చించేందుకు సిద్ధమేనని ఇప్పటికే కేంద్రం స్పష్టం చేసింది. నిజానికి ఈ సమస్యలను ఏదో ఒకరూపంలో చర్చించి, సమాధానాలు రాబట్టవచ్చు. ప్రశ్నోత్తరాల సమయంలో వాటిని కొనసాగించడం ద్వారాను సమస్యలకు పరిష్కారం కనుగొనవచ్చు. కానీ ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అలా చేయడం లేదు. కేవలం రచ్చచేయడం ద్వారా వార్తల్లోకి ఎక్కాలని చూస్తోంది. ప్రజలు ఆశిస్తున్నది ఏమిటో గుర్తించి అందుకు అనుగుణంగా ఎజెండాను రూపొందించుకోవడంలో కాంగ్రెస్ ప్రతిసారీ విఫలం అవుతోంది. పార్లెంట్ లోపలా,బయటా విధానాల రూపకల్పనలో కాంగ్రెస్ నాయకత్వం విఫలమవుతోంది. 75 ఏళ్లకు చేరువలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పోటీపడటంలో 50 ఏళ్లు పైబడిన రాహుల్‌గాంధీ వెనుకబడుతున్నారు. దీనికి కారణం స్పష్టమైన విధానాలు. నాయకత్వ లోపాలే కారణంగా చెప్పాలి. పార్లమెంట్ సమావేశాలు అనగానే ప్రజలు ఏమి కోరుకుంటున్నారన్న ఆలోచనలు చేయాలి. పార్లమెంటులో ఎలా చర్చిస్తే ప్రభుత్వాన్ని నిలదీయవచ్చన్న వ్యూహం ఉండాలి. ఇలాంటి వ్యూహాలు లేకపోవడం వల్లనే కాంగ్రెస్ కాలక్రమంలో మెజారిటీ ప్రజలకు దూరమవుతోంది. అలాగే యువతరానికి పూర్తిగా



దూరమయ్యారు. సమస్యలు ఎదురైనప్పుడు సత్తా చాటాలి. అందుకు పార్లమెంట్ మంచి వేదిక. ముందుతరం కాంగ్రెస్ నాయకత్వం అనుసరించిన విధానాలు ఏమిటి? ఇప్పుడు ఆ పార్టీ యువ నాయకత్వం అనుసరిస్తున్న విధానాలు ఏమిటి? అని ప్రశ్నించుకుంటే జవాబు లభించగలదు. ప్రధానంగా ఓ 20 రోజుల పాటు జరిగే పార్లమెంటులో ఏయే అంశాలు చర్చించాలి, ఎలా చర్చించాలి అనే ప్రణాళిక ఉండాలి. కానీ అలా జరగడంలేదు. రాహుల్‌కు నాయకత్వ లక్షణాలు ఎలాగూ లేవు. కనీసం ఇతర సీనియర్ నేతలతో చర్చించి, పార్లమెంట్ వ్యూహం అనుసరించాలి. అదీ చేయడం లేదు. ఈ కారణంగా మెజారిటీ ప్రజలు క్రమంగా ఆ పార్టీకి దూరమవుతూ వచ్చారు. నెహ్రూ,ఇందిరాగాంధీ అనుసరించిన విధానాలను కూడా రాహుల్‌గాంధీ అధ్యయనం చేయకపోవడం ఆశ్చర్యంగా ఉంది. సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను, పోకడలను ఆకళింపు చేసుకొని అందుకు అనుగుణంగా పార్టీకి దిశానిర్దేశం చేయడంలో రాహుల్‌గాంధీ విఫలం అవుతున్నారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల మనోభావాలకు అనుగుణం గా వ్యూహ రచన చేస్తూ పార్లమెంటులో తన వాగ్ధాటిని వినిపిస్తున్నారు. సమస్య ఏదైనా సమాధానం చెప్పడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు. అలాంటప్పుడు సమస్యను ఎలా, ఎప్పుడు చర్చించాలన్న వివేచన చేసుకోవాలి. అదేపనిగా వాయిదా తీర్మానాలు ఇవ్వడం, వాటిని స్పీకర్ తిరస్కరించడం షరామామూలుగా జరిగే ప్రక్రియ. అలాకాకుండా సమస్యలను గుర్తించి, వాటిపై అధ్యయనం చేసి, నోటీసులు ఇచ్చి చర్చకు పట్టుబట్టాలి. అలా చేయడంలో కాంగ్రెస్, దానిని అనుసరిస్తున్న ఇతర పార్టీలుకూడా విఫలం అవుతున్నాయి. తక్షణ చర్చ అన్నది దేశంలో కొంపలు అంటుకుంటే తప్ప జరగదు. ఈ మాత్రం కూడా తెలియని వారు మన నేతులగా ఉండడం దేశం చేసుకున్న దౌర్భాగ్యం. పార్లమెంట్ సమయాన్ని వృథా చేయకుండా సమస్యలను చర్చించేలా చేస్తు తప్ప ప్రజలు నమ్మరు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలు ఏమిటి? ఎన్నికల్లో ఆయన విజయాలు అందుకోవడానికి కారణం ఏమిటి? అని అధ్యయనం చేయకుండా కాలం చెల్లిన నినాదాలను అందిపుచ్చుకోవడం అవివేకం అవుతుంది. అందుకే భారతీయ జనతా పార్టీ మెజారిటీ ప్రజలకు చేరువ అవుతుండగా, కాంగ్రెస్ పార్టీ దూరమవుతోంది. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా, యువతరం మనోభావాలతో పొంతన లేకుండా రాహుల్‌గాంధీ ఆలోచనలు ఉండటం కాంగ్రెస్ పార్టీకి శాపంగా పరిణమిస్తోంది. అలాగే పార్లమెంట్ సమావేశాల్లో అర్థవంతమైన చర్చలకు ఆస్కారం లేకుండా పోతోంది. ప్రజల సమస్యలపై చర్చకు అవకాశం లేకుండా పోతోంది. దీనికి ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌దే బాధ్యత అని చెప్పక తప్పదు.

# విద్యావకాశాల కల్పనలో వివక్షా?



హైదరాబాద్,తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, తన ప్రత్యేక భౌగోళిక, సాంస్కృతిక వారసత్వంతోపాటు, విద్యా దేవత శ్రీ జ్ఞాన సరస్వతీ దేవి కొలువై ఉన్న పుణ్యభూమి. అయితే, దశాబ్దాలుగా ఈ ప్రాంతం ఉన్నత విద్యావకాశాల విషయంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ఎదుర్కొంటోంది. ఇది కేవలం ఒక ప్రాంతీయ సమస్యగా కాకుండా, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి, జ్ఞాన ఆధారిత సమాజ నిర్మాణం, ముఖ్యం గా ఏజెన్సీ ప్రాంతంలోని బడుగు, బలహీన వర్గాలు, ఆదివాసుల ఆత్మగౌరవానికి సంబంధించిన కీలక అంశంగా పరిగణించాలి. ఉన్నత విద్య అందుబాటులో లేకపోవడం వల్ల ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులు, ముఖ్యంగా ఆదివాసీ, బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఉన్నత చదువులకోసం ఇతర జిల్లాలకు, నగరాలకు వెళ్లడం వారి కుటుంబాలపై తీవ్ర ఆర్థికభారాన్ని మోపుతోంది. ప్రయాణ ఖర్చులు, వసతి, ఇతర జీవన వ్యయాలు గ్రామీణ, పేదకుటుంబాలకు పెనుభారంగా మారి, చాలామంది విద్యార్థులు మధ్యలోనే చదువు మానేస్తున్నారు. నిర్మల్ జిల్లా పాలకుల నిర్లక్ష్యం (%చీవస్త్రశ్రీఅస్త్రవఅఎవ చీఱతీఋశ్రీ ఎఱతీఱఅఔ ఖఎఎఱఅఱతీఋ-అశీఅ%) వల్ల, ఉన్నత విద్య బడుగు బలహీన వర్గాలకు అందనంత దూరంలో కనుమరుగవుతోంది. ఇది కేవలం ఆర్థిక భారం మాత్రమే కాదు. ప్రతిభావంతులైన విద్యార్థులు ఇతర విశ్వవిద్యాలయాల్లో చేరడం వల్ల, వారి మేధస్సు, నైపుణ్యాలు స్థానిక అభివృద్ధికి కాకుండా ఇతర ప్రాంతాలకు ఉపయోగపడుతున్నాయి. ఇది జిల్లాకు ఉండాల్సిన మానవ వనరుల సంపదను కోల్పోవడానికి దారితీస్తోంది. ఉన్నత విద్యా సంస్థల లేమి పరిశోధన, ఆవిష్కరణలకు అడ్డుకట్ట వేస్తోంది. స్థానిక సమస్యల పరిష్కారానికి, వనరుల సద్వినియోగానికి అవసరమైన నూతన ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం లేదు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల ప్రత్యేకతలు, సంస్కృతి, భాష, జీవన విధానాలపై పరిశోధనలు జరగకపోవడం వల్ల అవి అంతరించిపోయే ప్రమాదం ఉంది. స్థానికంగా ఉన్నత విద్య లేకపోవడం వల్ల స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు తక్కువగా లభిస్తున్నాయి. ఇది నిరుద్యోగానికి, యువతలో అసంతృప్తికి దారితీస్తోంది. ఆదివాసీ, బహుజన యువతకు విద్య ద్వారా లభించాల్సిన అవకాశాలు దూరమవుతున్నాయి. రాష్ట్రంలోనే కొన్నిప్రాంతాలు విద్యాపరంగా అభివృద్ధి చెందుతుండగా, ఆదిలాబాద్ వంటి జిల్లాలు వెనుకబడిపోవడం ప్రాంతీయ అసమానతలను పెంచుతోంది. ఇది బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తోంది. ఒక విశ్వవిద్యాలయం కేవలం విద్యను అందించే కేంద్రం మాత్రమే కాదు. అది జ్ఞాన ఉత్పత్తి కేంద్రంబీ పరిశోధనలు, కొత్త ఆలోచనల ద్వారా జ్ఞానాన్ని ఉత్పత్తి చేస్తుంది. ఆధునిక అవసరాలకు తగిన నైపుణ్యాలను విద్యార్థులకు అందిస్తుంది. ఇది ప్రాంతీయ అభివృద్ధికి ఊతమిస్తుందిబీ స్థానిక ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహిస్తుంది, ఉద్యోగాలను సృష్టిస్తుంది. ముఖ్యంగా గిరిజన యువతకు స్థానికంగా నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం కల్పిస్తుంది. విశ్వవిద్యాలయం సామాజిక చైతన్యాన్ని పెంచుతుందిబీ చర్చలు, మేధోమథనంద్వారా సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తుంది. ఇది సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తుందిబీ స్థానిక గిరిజన కళలు, సంస్కృతి, భాష, చరిత్రపై పరిశోధనలు చేసి వాటిని పరిరక్షిస్తుంది. ఇది వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటుతుంది. గిరిజన విద్యార్థులు తమ సొంత సంస్కృతి, చరిత్రను అధ్యయనం చేయడానికి, దానిని భవిష్యత్ తరాలకు అందించడానికి ఈ విశ్వవిద్యాలయం ఒక వేదిక అవుతుంది. ఆదిలాబాద్ జిల్లాకు విశ్వవిద్యాలయం అనే డిమాండ్ నేటిది కాదు, దశాబ్దాలుగా ఇది ఒక ఆకాంక్షగా కొనసాగుతోంది. 2009లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి నిర్మల్ పీజీ కళాశాలను శ్రీజ్ఞాన సరస్వతీ విశ్వవిద్యాలయంగా ఉన్నతీకరించడానికి నిధులు మంజూరు చేయడం ఒక చారిత్రాత్మక నిర్ణయం. అయితే, దురదృష్టవశాత్తు, ఆయన అకాల మరణం, తదనంతర స్వార్థ రాజకీయాలు ఈ ఆశలను అడియాశలు చేశాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత, ఈ డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది. అయితే, స్థానిక నాయకుల ఒత్తిడితో స్థలం మార్చడం, ఆపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్ల ప్రతిపాదన వెనక్కి పంపబడింది. ఇది కేవలం నిర్లక్ష్యం మాత్రమే కాదు, స్థానిక ప్రజల ఆకాంక్షలను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం. పదేళ్లకాలంలో రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పడినా, ఒక్క ప్రభుత్వ విశ్వవిద్యాలయం కూడా ఏర్పాటు కాకపోవడం ప్రభుత్వాల చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తోంది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా పర్యటనల్లో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం, ఉపముఖ్యమంత్రి భట్టీ విక్రమార్క, అధికారులకు ఆదేశాలు జారీచేయడం ఆశలు రేకెత్తించాయి. అయితే, ఖమ్మం లో మైనింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా ఉన్నతీకరించే ప్రక్రియ వేగంగా జరుగుతుండగా, ఆదిలాబాద్ విషయంలో జాప్యం జరగడం జిల్లాపట్ల కొనసాగుతున్న వివక్షను, బహుజనుల అభివృద్ధిని అడ్డుకుంటున్న పాలకుల వైఖరిని స్పష్టం చేస్తోంది. నిర్మల్ పట్టణంలోని ప్రస్తుత పిజి కళాశాల భవనాలు, 25 ఎకరాల అందుబాటులో ఉన్న స్థలం నూతన విశ్వవిద్యాలయానికి అనుకూలమైన ప్రదేశం. ఇది మౌలిక సదుపాయాల కల్పనకు తక్కువ సమయం, వ్యయం తీసుకుంటుంది. శ్రీ జ్ఞాన సరస్వతీ విశ్వవిద్యాలయం కేవలం ఒక విద్యా సంస్థ కాదు, అది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజల, ముఖ్యంగా గిరిజనుల, బడుగు బలహీనవర్గాల ఆత్మగౌరవానికి, భవిష్యత్తుకు ప్రతీక. ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల ఆకాంక్షను నెరవేర్చడానికి ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. లేనిపక్షంలో శ్రీజ్ఞాన సరస్వతీ విశ్వవిద్యాలయ సాధన సమితి ఆధ్వర్యంలో విద్యార్థులు, నిరుద్యోగులు, మేధావులు, ఉద్యోగులు, విపక్ష నాయకులతో కలిసి జిల్లావ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేయడం అనివార్యం. గిరిజనుల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటే విధంగా ఈ ఉద్యమం సాగుతుంది. మంజూరు జరిగి, నిధులు విడుదలై, పనులు ప్రారంభమై, విశ్వవిద్యాలయం ఏర్పడే వరకు ఈ పోరాటం కొనసాగుతుంది. ఈ పోరాటం ద్వారా, ఆదిలాబాద్ జిల్లా ప్రజలు తమ భవిష్యత్తును తామే రాసుకోవడానికి, జ్ఞాన ఆధారిత సమాజ నిర్మాణంలో, ఆదివాసీల, బహుజనుల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి సంకల్పించారు. ప్రభుత్వం ఈ ఆకాంక్షను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకుంటుందా, లేక ఈ ఉద్యమం మరింత తీవ్రరూపం దాలుస్తుందా అనేది కాలమే నిర్ణయిస్తుంది.

# మద్యం దోపిడీని రికవరీ చేయాలి

అమరావతి,ఏపీ మద్యం కుంభకోణంలో జగన్ దోచుకున్న రూ.3500 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ రికవరీ చట్టాన్ని అమలు చేయాలని లేదా కొత్త చట్టం తీసుకురావాలని తెలుగుదేశం సీనియర్ నేత,మాజీమంత్రి యనమల రామకృష్ణుడు సూచించారు. హత్య చేసే వ్యక్తి కంటే ఆర్థిక నేరస్థుడు చాలా ప్రమాదకరమని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని గుర్తుచేశారు. 3,500 కోట్ల రూపాయల మద్యం కుంభకోణంలో మిథున్ రెడ్డి మాస్టర్ మైండ్ అయితే.. ప్రధాన లబ్ధిదారుడు జగనే అని యనమల అన్నారు. ప్రజలను మోసం చేసిన వారిని న్యాయ విచారణతో పాటు ప్రజాకోర్టులోకి తీసుకురావాలని సూచించారు. తద్వారానే ప్రజాస్వామ్య పక్రియలో ఎన్నికల్లో ప్రజలు వారిని శిక్షించగలరని తెలిపారు. కక్షపూరిత కేసని వైకాపా నేతలు చెప్పటం నేరం నుంచి తప్పించుకునేందుకే అని అన్నారు. తప్పుడు మార్గాన్ని అనుసరించే వాళ్లు.. శిక్ష నుంచి ఎప్పటికీ తప్పించుకోలేరని స్పష్టం చేశారు. జగన్ నేతృత్వంలో చాలా మంది ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన డబ్బును మింగేసి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఈక్రమంలో ప్రజలను మోసం చేసి మద్యం కుంభకోణంలో జగన్ దోచుకున్న రూ.3500 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేయాలని యనమల రామకృష్ణుడు కూటమి ప్రభుత్వానికి సూచించారు.

# గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ-అమరావతి డిక్లరేషన్

అమరావతి,గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ- అమరావతి డిక్లరేషన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో చీఫ్ సెక్రటరీ విజయానంద్, నెడ్ క్యాప్ ఎండీ కమలాకర్ బాబు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. 2030 నాటికి ఏపీని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మార్చేందుకు అవసరమైన కార్యాచరణ ప్రకటిస్తూ డిక్లరేషన్‌ను రూపొందించారు. ఇటీవల అమరావతిలో గ్రీన్ హైడ్రోజన్‌పై రెండు రోజుల పాటు- జరిగిన సమ్మిట్‌లో గ్రీన్ హైడ్రోజన్ కంపెనీల సీఈఓలు, సీఓఓలు, ఎండీలు, ఇండస్ట్రీ రంగ నిపుణులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు- జరిగిన సమ్మిట్‌లో చర్చించిన అంశాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం డిక్లరేషన్ ప్రకటించింది. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి అనుకూల పరిస్థితులు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి దేశంలోనే అతిపెద్ద ఎకో సిస్టంను రాష్ట్రంలో నెలకొల్పటమే ఈ డిక్లరేషన్ ఉద్దేశమన్నారు. ఇటీవల అమరావతిలో జరిగిన రెండు రోజుల గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్‌లో చర్చించిన అంశాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ డిక్లరేషన్ ప్రకటించింది. అమరావతిలో జరిగిన సమ్మిట్‌లో 600 మంది ప్రతినిధులు, ఇండస్ట్రీ రంగ నిపుణులు పాల్గొన్నారు. 7 సెషన్స్‌గా జరిగిన ఈ సమ్మిట్‌లో గ్రీన్ హైడ్రోజన్ కంపెనీల సీఈఓలు, సీఓఓలు, ఎండిలు పాల్గొన్నారు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి సంబంధించి ప్రయోగాలు, సాంకేతికత, పెట్టు-బడులపై చర్చలు సాగాయి. భారత్‌లో స్వచ్ఛమైన ఇంధనాల ఉత్పత్తి, గ్రీన్ హైడ్రోజన్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు విధివిధానాలు రూపొందించేలా ఈ డిక్లరేషన్ ప్రకటించారు. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి అనుకూల పరిస్థితులు కల్పించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యం చేసుకుంది. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి దేశంలోనే అతిపెద్ద ఎకో సిస్టంను రాష్ట్రంలో నెలకొల్పటమే డిక్లరేషన్ ముఖ్య ఉద్దేశ్యం. 2027 నాటికి 2 గిగావాట్లు-, 2029కి 5 గిగావాట్ల ఎలక్ట్రోలైజర్ల తయారీ లక్ష్యంగా చేసుకున్నారు. 2029 నాటికి ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయాలని, కిలో హైడ్రోజన్ గ్యాస్ రూ. 460 నుంచి రూ.160కి తగ్గించేలా కార్యాచరణ రూపొందించారు. 2029 నాటికి 25 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ పంపిణీకి ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు- చేయాలని ప్రణాళిక చేశారు. గ్రీన్ హైడ్రోజన్ రంగంలో పరిశోధనల కోసం ప్రభుత్వం రూ. 500 కోట్ల నిధులు వెచ్చించనున్నట్లు- సీఎం చంద్రబాబు ప్రకటించారు. అలాగే ఈ రంగంలో ముందడుగు వేసే 50 స్టార్టప్‌లకు ప్రోత్సాహం కల్పించనున్నట్లు- డిక్లరేషన్‌లో పేర్కొన్నారు. ఈ డిక్లరేషన్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గ్లోబల్ గ్రీన్ ఎనర్జీ మ్యాప్‌పై ప్రత్యేక గుర్తింపు పొందే అవకాశముందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇది దేశవ్యాప్తంగా గ్రీన్ హైడ్రోజన్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు దారితీసే మోడల్ స్టేట్‌గా ఏపీని నిలిపేందుకు బలమైన అడుగు అని విశ్లేషకులు భావిస్తున్నారు.

## నిష్పక్షపాతంగా అహ్మదాబాద్ విమాన ప్రమాద దర్యాప్తు

న్యూఢిల్లీ,ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై నిష్పక్షపాతంగా దర్యాప్తు సాగుతోందని కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. విదేశీ మీడియా కావాలనే ప్రమాదంపై అనుచిత వార్తలు ప్రచారం చేస్తోందని అన్నారు. లోక్‌సభలో ప్రతిపక్షాలు ప్రశ్నించిన నేపథ్యంలో.. అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమానం ప్రమాదంపై దర్యాప్తు అంతర్జాతీయ ప్రోటోకాల్‌లకు అనుగుణంగా జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ దర్యాప్తును ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బోర్డ్ నిర్వహిస్తోందన్నారు. ప్రమాదం ఎలా, ఎందుకు జరిగిందనే దానిపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని, తుది నివేదికలో పూర్తి వివరాలు వెల్లడవుతాయని మంత్రి అన్నారు. మొదటి దశ దర్యాప్తు ఇప్పటికే పూర్తయింది. ఈ దశలో ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. విమానంలోని బ్లాక్ బాక్స్‌కు కొంత నష్టం జరిగినట్లు- తెలిసింది. సాధారణంగా, బ్లాక్ బాక్స్‌కు నష్టం జరిగినప్పుడు దానిని విశ్లేషణ కోసం తయారీదారుకు పంపడం ఆనవాయితీ. అయితే, ఈ సారి భారతదేశంలోనే మొదటిసారిగా బ్లాక్ బాక్స్ డీకోడింగ్ పక్రియ విజయవంతంగా జరిగిందని మంత్రి రామ్ మోహన్ నాయుడు వెల్లడించారు. ఇది భారతదేశ పౌర విమానయాన రంగంలో ఒక ముఖ్యమైన విజయంగా ఆయన అభివర్ణించారు. దర్యాప్తు పక్రియలో నిష్పాక్షికతను మంత్రి సమర్థించారు. కొన్ని విదేశీ మీడియా సంస్థలు ఈ ప్రమాదంపై తమ సొంత కథనాలను రూపొందించి తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. అలాంటి కథనాలను తాను గమనించానని, వాటిని నమ్మొద్దన్నారు. ఈ సందర్భంగా, ఎయిర్ ఇండియా లేదా బోయింగ్ వంటి సంస్థలకు మద్దతు ఇవ్వడం కాదని, తమ లక్ష్యం కేవలం సత్యాన్ని వెలికితీసేందుకేనని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. దర్యాప్తు పక్రియను అందరూ గౌరవించాలని, నిజమైన సమాచారం తుది నివేదిక ద్వారా బయటకు వస్తుందని ఆయన వెల్లడించారు. ఇలాంటి విమాన ప్రమాద దర్యాప్తులు అంతర్జాతీయంగా ఒక నిర్దిష్ట పక్రియను అనుసరిస్తాయని మంత్రి వివరించారు. భారతదేశం కూడా ఈ అంతర్జాతీయ ప్రమాణాలకు కట్టుబడి ఉందని, ఈ దర్యాప్తు ఆ దిశగా సాగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రమాద కారణాలను గుర్తించేందుకు సమగ్ర విశ్లేషణ జరుగుతోందని, తుది నివేదికలో అన్ని వివరాలు స్పష్టమవుతాయని ఆయన హామీ ఇచ్చారు. ఈ విషయంపై లోక్‌సభలో జరిగిన చర్చల సందర్భంగా,

## పీఎమ్ఎస్‌హెచ్ఆర్ఐ పథకం 953 పాఠశాలల ఎంపిక

న్యూఢిల్లీ,ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పీఎమ్ఎస్‌హెచ్ఆర్ఐ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో మరిన్ని పాఠశాలలు చేర్చే అవకాశముందని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి వెల్లడించారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 953 పాఠశాలలను ఎంపిక చేసినట్లు- వివరించారు. ఆ జాబితాలో ఎన్టీఆర్ జిల్లాలో 29 పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. అందుకోసం రూ. 1620.6 లక్షలు వినియోగిస్తామన్నారు. ఛాలెంజింగ్ మెథడ్‌లో భాగంగా ఏడు దశల్లో 935 పాఠశాలలు ఎంపిక చేసినట్లు- కేంద్ర మంత్రి జయంత్ చౌదరి చెప్పారు. రాష్ట్రంలో పీఎమ్ఎస్ఆర్ఐ పథకం కింద జిల్లాల వారీగా అభివృద్ధి కోసం ఎంపిక చేసిన పాఠశాలల సంఖ్య, నిర్మించాల్సిన సదుపాయాలు, నిధుల కేటాయింపుతోపాటు- ఈ పథకంలో మరిన్ని పాఠశాలలు చేర్చే అవకాశం ఉందా? అనే అంశాలు తెలియజేయాలంటూ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నలకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి రాత పూర్వకంగా సమాధానమిచ్చారు. ఈ పాఠశాలలు.. విద్యార్థులకు కేవలం పాఠాలు బోధించడం మాత్రమే కాకుండా సమగ్ర వ్యక్తిత్వ అభివృద్ధితో పాటు- నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తాయని స్పష్టం చేశారు. ఈ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూములు, సైన్స్ ల్యాబ్స్, డిజిటల్ లైబ్రరీలు, ఎల్.ఈ.డి లైటింగ్, ఔషధ తోటలు, గ్రీన్ కంపోస్టింగ్ యూనిట్లు- ఏర్పాటు- చేయడం ద్వారా విద్యార్థులకు ఆధునిక విద్యను అందించేందుకు చర్యలు చేపట్టినట్లు- వివరించారు. పారదర్శక పోటీ- పద్ధతిలో ఈ పాఠశాలల ఎంపిక జరిగినట్లు- తెలిపారు. ఈ పాఠశాలలకు అవసరమైన సదుపాయాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సమర్పిస్తుందని.. ఆ ప్రతిపాదనలను ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు ఆమోదిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రధాన్ మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం కింద అత్యధికంగా కర్నూలు జిల్లాలో 54 పాఠశాలలు, విశాఖపట్నంలో కేవలం 6 పాఠశాలలు మాత్రమే ఎంపి-కై-నట్లు- ఆయన గణాంకాలతో సహా సోదాహరణగా వివరించారు. ఇక ఎన్టీఆర్ జిల్లాలో ఈ పథకం కింద 29 పాఠశాలలు ఎంపిక కాగా.. ఈ పాఠశాలల కోసం రూ.3,404.1 లక్షలు నిధుల కేటాయించామని చెప్పారు. అందులోభాగంగా రూ.1628.2 లక్షలు నిధులు విడుదల చేసి.. రూ.1620.6 లక్షలు వినియోగించినట్లు తెలిపారు. ఈ పాఠశాలల అభివృద్ధిలో ప్రధానంగా సైన్స్ ల్యాబ్స్, స్మార్ట్ తరగతులు, డిజిటల్ బోర్డులు, రఊఉ లైటింగ్, గ్రంధాలయాలు, ఆటల మైదానాలతోపాటు- 'గ్రీన్ స్కూల్స్' లక్ష్యంగా ఉన్నాయని విద్యా శాఖ సహాయ మంత్రి తెలిపారు. అలాగే జాతీయ విద్యా విధానం - 2020లో పేర్కొన్న అన్ని అంశాలను ఆచరణలో పెట్టే విధంగా ఈ పాఠశాలలు తీర్చిదిద్దబడుతున్నాయని పేర్కొంది. పారదర్శక పోటీ- పద్ధతిలో ఎంపిక చేసిన ఈ పాఠశాలల్లో విద్యార్థులకు సమాన అవకాశాలు, ఆధునిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు.

## ఎనిమిదన్నర దశాబ్దాల అనుబంధం గుర్తు చేసుకున్న పార్టీ

న్యూఢిల్లీ,కమ్యూనిస్ట్ ఉద్యమంలో ప్రముఖ నేత, అనుభవజ్ఞుడు వి.ఎస్.అచ్యుతానందన్ (101) మృతికి పొలిట్‌బ్యూరో తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీతో ఎనిమిదన్నర దశాబ్దాల అనుబంధం కలిగిన వి.ఎస్.అచ్యుతానందన్.. కేరళలో కమ్యూనిస్ట్ ఉద్యమ స్థిరత్వానికి ఎంతగానో కృషి చేశారు. ప్రజావక్తగా ప్రజలతో నేరుగా సంభాషించే కళలో ప్రావిణ్యం సంపాదించారు. కఠినమైన జీవనశైలి, సామాజిక న్యాయం పట్ల నిబద్ధత కలగిన వ్యక్తిగా గుర్తింపుపొందిన విఎస్... కేరళ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారు. ఆయన మృతి పార్టీకి, కమ్యూనిస్ట్ ఉద్యమానికి తీరని లోటని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఆయనకు నివాళిగా ఎర్రజెండాను అవనతం చేసింది. ఆయన భార్య, కుమారుడు, కుమార్తెలకు సానుభూతి ప్రకటించింది.వి.ఎస్ అని ముద్దుగా పిలుచుకునే అచ్యుతానందన్ కేరళలో వివిధ పోరాటాలకు నేతృత్వం వహించడమే కాకుండా సమర్థవంతంగా నడిపించారు. కార్మికుడిగా ఆస్పిన్వాల్ కంపెనీలో పనిచేసిన సమయంలో కొబ్బరిపీచు కార్మికులను సంఘటిత పరిచారు. ఆ సమయంలోనే మొదటిసారి ట్రేడ్ యూనియన్ ఉద్యమంలోకి అడుగుపెట్టారు. 17 ఏళ్ల వయస్సులో విఎస్ 1940లో కమ్యూనిస్ట్ పార్టీలో చేరారు. కృష్ణ పిళ్ళై ఆయనను కుట్టనాడ్‌లో భూస్వాములతో భయంకరమైన దోపిడీకి గురవుతున్న వ్యవసాయ కార్మికుల మధ్య పని అప్పగించారు. ట్రావెన్ కోర్ దివాన్‌కు వ్యతిరేకగా జరిగిన వున్నప్ర వాయిలార్ తిరుగుబాటు- సమయంలో వి.ఎస్. అజ్ఞాతంలోకి వెళ్లారు. అరెస్టు తర్వాత పోలీసులు ఆయనను తీవ్రమైన హింసకు గురిచేశారు. 1956లో ఐక్య కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర కమిటీ-కి, 1958లో జాతీయ మండలికి ఎన్నికయ్యారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్)ను స్థాపించిన జాతీయమండలిలో మిగిలి ఉన్న 32 మంది సభ్యుల్లో ఆయన చివరి వ్యక్తి. ఆయన 1980-1991 వరకు సిపిఐ(ఎం) కేరళ రాష్ట్ర కమిటీ- కార్యదర్శిగా పనిచేశారు. 1964లో పార్టీ కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1985లో పొలిట్‌బ్యూరో సభ్యుడయ్యారు. వయస్సు రీత్యా 2022లో ఆయనను కేంద్ర కమిటీ- నుండి రిలీవ్ చేయగా, ఆ తర్వాత ప్రత్యేక ఆహ్వానితునిగా వున్నారు. కేరళ అసెంబ్లీకి ఏడు పర్యాయాలు ఎన్నికయ్యారు. రెండు పర్యాయాలు ప్రతిపక్ష నేతగా పనిచేశారు. 2006 -2011 మధ్య కేరళ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ముఖ్యమంత్రిగా ఆయన పదవీకాలంలో కార్మికుల సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టారు.

## రాజ్యసభలో నలుగురు కొత్త సభ్యుల ప్రమాణం

న్యూఢిల్లీ, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ, రాజ్యసభ సమావేశమయ్యాయి. తొలుత పహల్గాం ఉగ్రదాడి, ఎయిరిండియా విమాన ప్రమాద మృతులకు ఉభయ సభలు నివాళులర్పించాయి. రాజ్యసభలో కొత్తగా ఎంపికైన నలుగురు ఎంపీలు ప్రమాణస్వీకారం చేశారు. అటు- లోక్‌సభలో విపక్షాలు నిరసనకు దిగాయి. ఆపరేషన్ సిందూర్'తో పాటు పలు అంశాలపై చర్చకు పట్టుబడుతూ లోక్‌సభలో విపక్షాలు ఆందోళన చేపట్టాయి. తామిచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చించాలని పట్టుబట్టాయి. అయితే ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి, మీరు చర్చక్రమంలో వస్తే సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పీకర్ ప్రకటించారు. పోడియంలోకి రావడం, నిలబడి నినాదాలు చేయడం తగదని అన్నారు. వారి నినాదాల నడుమ స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ప్రతిపక్ష ఎంపీలు నిరసన విరమించాలని సభాపతి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ వారు వినిపించుకోకపోవడంతో సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పార్లమెంటు సమావేశాలు జరగడం ఇదే తొలిసారి. ఆగస్టు 21 వరకు 21 రోజుల పాటు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్ సహా అనేక అంశాలపై ప్రశ్నల్ని సంధించడానికి విపక్షాలు మూకుమ్మడిగా సిద్ధమయ్యాయి. తాము లేవనెత్తే అంశాలపై ప్రధాని స్పందిం చాల్సిందేనని డిమాండ్ చేస్తున్నాయి. అయితే, పార్లమెంటు- నియమాలు, సంప్రదాయాలకు అనుగుణంగా 'ఆపరేషన్ సిందూర్' సహా అన్ని అంశాలు చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే స్పష్టం చేశారు.

# రేణుకాకు చెక్! ఆ మంత్రుల స్కెచ్?



ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తన కను సైగలతో దశాబ్దాల తరబడి జిల్లా రాజకీయాలను శాసించారు ఎంపీ రేణుకాచౌదరి .. అప్పట్లో కాంగ్రెస్ ఆదిష్టానం వద్ద ఆమె ఏం చెబితే అదే నడిచేదట..అంతలా రాజకీయాలని ప్రభుతం చేసిన ఆమె ప్రస్తుతం ఆ జిల్లా వైపు కన్నెత్తి చూడడం లేదు .. ఆమెనే నమ్ముకున్న అనుచర వర్గానికి పార్టీ అధికారంలో ఉన్నా దిక్కులేకుండా పోయిందంట. ప్రస్తుతం ఆమెను జిల్లాకు రాకుండా ఆ వర్గానికి చెక్ పెట్టేలా జిల్లా మంత్రులు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారా? ఫలితంగానే రేణుకాచౌదరి తన అనుచరులను సైతం పట్టించుకోని పరిస్థితి వచ్చిందా? అసలు ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌లో ఏం జరుగుతోంది?

**ఖమ్మం జిల్లా ఆడబిడ్డనని చెప్పుకునే రేణుకాచౌదరి**

ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాలే కాకుండా ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఒక వెలుగు వెలిగిన మహిళ నేత.. జిల్లా ఆడ బిడ్డగా చెప్పుకునే కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ రేణుకా చౌదరి.. పొలిటికల్ సర్కిల్ లో ఆమెకు కాంగ్రెస్ ఫైర్ బ్రాండ్ గా పేరుంది. టీడీపీలో తన రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి 2 సార్లు రాజ్యసభ్యురాలిగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన ఆమె ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నుండి రాజ్యసభ సభ్యురాలుగా కొనసాగుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడ ఖమ్మం జిల్లా రాజకీయాలను తన కనుసైగలతో శాసించిన ఆ ఫైర్ బ్రాండ్ కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా వ్యవహరించారు

**2019లో ఖమ్మం ఎంపీగా పోటీ చేసి పరాజయం**

తెలంగాణ ఏర్పడ్డ తర్వాత రెండవ సారి 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ నుండి పోటీ చేసి ఓటమి పాలయ్యారు..గడిచిన దశాబ్ద కాలంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రేణుకాచౌదరి ఖమ్మం జిల్లాలో పర్యటించిప్పుడు అప్పటి గులాబీ పార్టీ ప్రభుత్వంపై మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై రేణుక చౌదరి ఒంటి కాలుపై విరుచుకుపడిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

**మన్మోహన్ క్యాబినెట్లో మంత్రిగా పనిచేసిన రేణుక**

అయితే రాష్టంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 1998లో కాంగ్రెస్‌లో చేరి రెండు సార్లు ఖమ్మం ఎంపీగా గెలిచి, 2004లో మన్మోహన్ క్యాబినెట్ మంత్రిగా పనిచేసిన రేణుకా చౌదరికి సోనియా గాంధీ కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యంతో నేటికీ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వద్ద మంచి గుర్తింపు ఉందంటారు. అందులో భాగంగా ఆమెను తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పెద్దల సభకు పంపి రాజ్యసభ సభ్యురాలిగా నియమించారు. ఆ క్రమంలో ఆమె ఎంపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మూడు, నాలుగు సార్లు మాత్రమే ఖమ్మం జిల్లాలో పర్యటించడం చర్చనీయాంశంగా మారింది.

**ఏడాదిగా ఖమ్మం జిల్లా వైపు చూడని రేణుకచౌదరి**

ఖమ్మం పార్లమెంటు సభ్యుడు రఘురాంరెడ్డి తో కసి, జిల్లాను పర్యటక రంగంలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని రేణుక చెప్పి దాదాపు సంవత్సరం అవుతుంది.. అప్పటి నుండి ఇప్పటి వరకు రేణుకా చౌదరి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు రాకపోవడం గమనార్హం.. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ లో రేణుకా చౌదరికి ముందు నుంచి తనకంటూ ఓ ప్రత్యేక వర్గం ఉంది. ప్రస్తుతం పార్టీ అధికారంలో ఉండి కూడా జిల్లాలో ఆమె పర్యటించక పోవడంతో పొలిటికల్ సర్కిల్స్‌లో రకరకాల చర్చలు నడుస్తున్నాయి. గతం నుండే జిల్లాలో ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వర్సెస్ రేణుకా చౌదరి నడుమ వర్గపోరు ఓ రేంజ్లో ఉంటూ వచ్చింది.

**రాజకీయంగా మంత్రులతో పోటీ పడలేకపోతున్నారా?**

అలాంటి రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రస్తుతం జిల్లాలో ముగ్గురు కీలక మంత్రులు ఉన్నారు. మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు ఎవరి సొంత వర్గాలు వారికున్నాయి. పూర్తి ఫాంలో ఉన్న ఆ ముగ్గురు బలమైన మంత్రుల మధ్యకు వెళ్లి రాజకీయం చేయలేక.. రేణుకాచౌదరి జిల్లాకు వెళ్లలేకపోతున్నారన్న చర్చ నడుస్తుందట. మరోవైపు జిల్లాలో ఆమె అవసరం లేదనే సంకేతాలు ఆదిష్టానానికి జిల్లా నేతలు పంపారన్న టాక్ కూడా వినిపిస్తోంది.ఆ క్రమంలో ఎప్పటి నుండో రేణుకా వర్గంగా చెప్పుకుని కాంగ్రెస్ ను అంటిపెట్టుకుని ఉన్నవారు అసంతృప్తిలో కొట్టుమిట్టాడుతున్నారట.. ఆమె జిల్లాకు రాకపోవడంతో అనుచర వర్గం పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందట. ముగ్గురు మంత్రులతోను ఆమెకు పొసగకపోవడం లేదన్న టాక్ కూడా ఉంది.

**జిల్లా మంత్రుల పర్యటనలో కనిపించని రాజ్యసభ సభ్యురాలు**

జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యురాలిగా ఉండి జిల్లా మంత్రుల పర్యటనలో ఆమె ఇప్పటి వరకు పాల్గొన్న సందర్భాలు లేవనే చెప్పాలి. ఆమె జిల్లాకు రాకపోవడానికి కారణాలు ఏవైనా రేణుక తన క్యాడర్ ను కాపాడుకోవడం కోసమైనా జిల్లాలో పర్యటించాలని అనుచరులు కోరుకుంటున్నారట. ఇంకో వైపు పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తమకు ప్రాధాన్యత ఉంటుందో లేదో? అని ఆమె అనుచరుల్లో గుబులు చెందుతూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారట.

**నామినేటెడ్ పదవుల్లో జిల్లా మంత్రుల వర్గీయులకు పెద్ద పీట**

పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి, తుమ్మల వర్గీయులకు నామినేటెడ్ పదవుల్లో అగ్ర పీఠం వేశారు. కానీ రేణుక వర్గానికి చెందిన వారికి ఎలాంటి నామినేటెడ్ పదవులు కట్టబెట్టకపోవడంపై ఆమె వర్గీయులు ఇప్పటికే అధిష్టానంపై అసంతృప్తితో ఉన్నారట.. ఇదే వ్యవహారంపై రేణుకా సైతం ఇటీవల కాలంలో రాష్ట్ర అధిష్టానంతో తేల్చుకుంటానంటూ హైదరాబాదులో తన నివాసంలో అనుచరుల ముందు ఘాటుగా వ్యాఖ్యానించారంట.అయితే ఇంతవరకు అతీగతి లేకపోవడంతో త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో కూడా తమ వర్గానికి ఎక్కడ మొండి చెయ్యి చూపుతారేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారట ఆమె వర్గీయులు. ఈ పరిస్థితికి కారణం ముగ్గురు మంత్రులతో ఆమెకు సయోధ్య లేకపోవడమా?.. లేక కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వద్ద తగిన ప్రాబల్యం లేదా? అన్న చర్చ జరుగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో తన వర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించక పోతే నేరుగా అధిష్టానంతోనే తేల్చుకుంటానని రేణుకాచౌదరి అంటున్నారంట. అధిష్టానం వద్ద ఉన్న పలుకుబడి కారణంగానే మంత్రుల తోనూ ఆమె అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని చెప్పున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే జిల్లాలో రేణుక ప్రభావం తగ్గిపోయే అవకాశం లేకపోలేదంటున్నారు. ఇప్పటికైనా తన వారి కోసమైనా ఆమె రంగంలోకి దిగుతారా? లేదంటే.. ఆ మంత్రులతో మన కేందుకులే అని సర్దుకుపోతారో చూడాలి.

# లిక్కర్ మాఫియా గుప్పిట్లో ప్రభుత్వం



హైదరాబాద్, కుల వృత్తులను కాపాడుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వాటిని నాశనం చేయాలని చూస్తుందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఏ కుల వృత్తిపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. ఆదాయం వచ్చే కుల వృత్తులను ప్రభుత్వం నాశనం చేయాలని చూస్తోందన్నారు. గీత కార్మికులకు ఐదు ఎకరాల పొలం ఇస్తామని చెప్పారు. గీత కార్మికులు చెట్లపై నుంచి పడి చనిపోతే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లుగీత వృత్తిని బంద్ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. కల్లు కంపౌండ్ ద్వారా పది కులాలు బ్రతుకుతున్నాయి. ఉప్పల్‌లో తాటి చెట్లు- కొట్టి గీత కార్మికులకు నష్టం చేశారు. కల్లు కంపౌండ్‌ను నిషేధిస్తామని ప్రభుత్వం లీకులు ఇస్తోంది. లిక్కర్ కంపెనీలు, డిస్టలరీలన్ని ఒకరిద్దరి చేతుల్లో నడుస్తున్నాయి. లిక్కర్ కంపెనీల కమీషన్లకు కక్కుర్తిపడి, లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లు కాంపౌండ్ బంద్ చేయాలని చూస్తున్నారని మండిపడ్డరు. కల్లులో మీరే ఏదో కలిపి కుట్ర చేస్తూ ఓఆర్ఆర్ లోపల కల్లుపై నిషేధం విధించాలని చూస్తున్నారు. కుల వృత్తిని అవమానించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిని నిషేధించడంలో ప్రభుత్వం ఎందుకు విఫలం అవుతుంది. కల్తీ పాలు అరికట్టడంపై ప్రభుత్వం ఎందుకు దృష్టి పెట్టడం లేదు. రాష్ట్రంలో విచ్చలవిడిగా ఫార్మా కంపెనీలకు పర్మిషన్లు ఇస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో నిషేధించిన బీర్లను తెలంగాణలో అమ్ముతున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఒక్కో ఎమ్మెల్యేకు 10 నుంచి 15 లక్షలు ఇస్తున్నారు. దాదాపు 35 మంది ఎమ్మెల్యేలు నెలవారీ డబ్బులు తీసుకుంటు-న్నారు. కల్తీ కల్లును ప్రోత్సహిస్తున్నది ఎవరనేది ప్రభుత్వం తేల్చాలి. గీత సంఘాల నుంచి ఎమ్మెల్యేలు డబ్బులు తీసుకుంటూ కల్తీ కల్లును ప్రోత్సహిస్తున్నారా? బిఆర్ఎస్ హయాంలో జిల్లాకో నీరా కేంద్రం పెట్టాలని భావించాం. హైదరాబాద్ నగర నడిబొడ్డున నీరా కేఫ్ పెట్టి కులవృత్తిని కాపాడాం. కల్లు కంపౌండ్ దమ్ముంటే బంద్ చేసి చూడండి. కల్లు కంపౌండ్ బంద్ చేస్తే ప్రభుత్వాన్ని నడవనీయం. మళ్లీ కేసీఆర్ సీఎం కాగానే కల్లు దుకాణాలను తెరిపిస్తాం. వైన్ షాపులు కల్లుగీత కార్మికుల కుటుంబాలకు ఇస్తాం అని ప్రకటించారు. నిజామాబాద్ జిల్లాలో గౌడ కులస్తులపై నిషేధం విధించారు. 60 మంది గౌడ కుల స్త్రీలు గుడికి వెళ్తే గుళ్లోకి రావద్దని వెనక్కి పంపారు. లక్షలు, లక్షలు మామూళ్లు తీసుకుని కల్లు దుకాణాలు బంద్ చేస్తామంటే చూస్తూ ఊరుకోం. కల్లు దుకాణాలు బంద్ పెడితే బల్కంపేట ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద మామూళు తీసుకుంటున్న ఎమ్మెల్యేల పేర్లు బయటపెడతాం. హైదరాబాద్ నగర శివారు ప్రాంతంలో గీత చెట్లు- ఉన్నాయి. కల్లు కంపౌండ్ పేదోళ్లకు రిక్రియేషన్ సెంటర్ లాగా ఉంటు-ంది. తాము అధికారంలోకి వచ్చాక లిక్కర్ మాఫియా నుంచి, కల్లు కంపౌండ్ నుంచి డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. అలాగే తాటి చెట్లు- నరికిన వారిపై కేసులు పెట్టాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీల పట్ల వివక్ష చూపుతున్నారన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ కాంగ్రెస్ పార్టీకి గుర్తుకు రాలేదా అని ఆయన ప్రశ్నించారు. 34 శాతం రిజర్వేషన్లపై 2013లో కాంగ్రెస్ పార్టీ కోర్టుకు అఫిడవిట్ ఇచ్చి, ఈసారికి మాత్రమే బీసీ రిజర్వేషన్లు అని చెప్పిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మూలంగానే ఏపీ, తెలంగాణలో బీసీలకు 23 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నట్లు- తెలిపారు. బీసీలకు రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల పట్ల రేవంత్ రెడ్డి. ఎప్పుడూ సానుకూలంగా లేరన్నారు. 2018లో మహారాష్ట్రలో ఆర్డినెన్స్ ఇచ్చి ఎన్నికలకు వెళ్తే నామినేషన్లు తర్వాత కోర్టు తీర్పు ద్వారా ఎన్నికలు ఆగిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళ్లడంతోనే బీసీలకు గతంలో రిజర్వేషన్లు రాలేదన్నారు. బీసీ రిజర్వేషన్లపై రాహుల్ గాంధీ వద్దకు తీసుకువెళ్లి కేంద్రంపై పోరాటం చేస్తామని రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నారన్నారు. బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చి ఎన్నికలు నిర్వహించాలని భిక్షమయ్య గౌడ్ చెప్పారు. తుంగతుర్తి నియోజకవర్గం పర్యటన సందర్భంగా గౌడన్నలకు ఇస్తామన్న హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేసిన శ్రీకాంత్ అనే యువకుడిని కొట్టించారన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా నామకరణం చేస్తామని చెప్పి రేవంత్ రెడ్డి మాట తప్పారన్నారు. శ్రీకాంత్‌పై జరిగిన దాడికి సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు. కల్లు అనేది ప్రకృతి పానీయమని, అలాంటి కల్లుని నిషేధించాలని ప్రభుత్వం చూస్తోందని కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ అన్నారు. కల్తీ కల్లును కచ్చితంగా అరికట్టాలి. కానీ ఆ పేరుతో కల్లును నిషేదిస్తే ఖబడ్దార్ రేవంత్ రెడ్డి అని ఆయన హెచ్చరించారు. కల్లు మండువాలు, కల్లు గీత కార్మికుల జోలికి వస్తే రాజకీయంగా సంగతి తెలుస్తా మన్నారు. కల్లుగీత కార్మికులకు 25 శాతం వైన్ షాపులు కేటాయిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని దుయ్యబట్టారు. కల్లుగీత కార్మికులను దొంగల్లా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని, గీత కార్మికుల ఉసురు ప్రభుత్వానికి కచ్చితంగా తగులుతుందన్నారు. నీరా కేఫ్‌ను హైదరాబాద్ నగరంలో పెడితే కాంగ్రెస్ వచ్చాక ఆగం చేసిందన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు గట్టు- రాంచందర్ రావు, నాగేందర్ గౌడ్ పాల్గొన్నారు.

## సీమకు జగన్ చేసిందేమీ లేదు: మంత్రి డోలా

నంద్యాల,రాయలసీమకు మాజీ సీఎం జగన్ చేసిందేమీ లేదని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టుతో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని చెప్పారు.

## వేసవిలోనూ సాగునీరిచ్చిన ఘనత మనది

గజ్వేల్, భారత రాష్ట్ర సమితి హయాంలో వేసవిలోనూ పంటల సాగుకు తగినంత నీరు ఇచ్చామని సిదిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గతంలో హల్దీ వాగులో లిఫ్ట్ పెట్టి గద్దర్ వాళ్ల ఊరికి నీళ్లు వచ్చేలా చేశామని చెప్పారు. కేసీఆర్ పాలనను గద్దర్ కూడా మెచ్చుకున్నారని పేర్కొన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం నీళ్లు ఇవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. కాళేశ్వరంలను కావాలనే పండబెట్టారని అన్నారు. సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల ముఖ్య సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి మద్దతుదారులను గెలిపించుకోవాలన్నారు. అన్ని మండలాల్లో విజయకేతనం ఎగురవేయాలన్నారు. కాంగ్రెస్ పాలనలో భూముల ధరలు తగ్గిపోయా యని చెప్పారు. ఒకప్పుడు తెలంగాణలో ఎకరా భూమి అమ్మితే ఏపీలో పదేకరాల భూమి వచ్చేదని.. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక సీన్ రివర్స్ హరీష్ రావు ఎద్దేవా చేశారు. ఏపీలో ఎకరా అమ్మితే ఇప్పుడు తెలంగాణలో రెండెకరాల భూమి వస్తుందని.. సీఎం రేవంత్ రెడ్డికి పాలన చేతకాక మన దగ్గర ఇలాంటి పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. తెలంగాణలో మళ్ళీ కేసీఆర్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటు న్నారన్నారు. సిద్దిపేట జిల్లాపై కాంగ్రెస్ పార్టీ పగపట్టిందని హరీష్ రావు పేరొన్నారు. కాంగ్రెస్ 20 నెలల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైంది. కాంగ్రెస్ పాలనలో ప్రజలు స్వీయ అనుభవం చెందారు. రేవంత్ రెడ్డి చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగుల ను కాంగ్రెస్ పార్టీ రెచ్చగొట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఒక్కరికి కూడా పెన్షన్ ఇవ్వలేదు కానీ 2 లక్షల పెన్షన్లు తీసేశారు. కాంగ్రెస్ పాలనలో ఎరువుల కోసం చెప్పులు క్యూలైన్లో పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. కేసీఆర్ హయాంలో నాట్లకు, నాట్లకు రైతు బంధు వచ్చేది. రేవంత్ రెడ్డి హయాంలో ఓట్లకు, ఓట్లకు మధ్య రైతు భరోసా వస్తుంది. కాంగ్రెస్ వచ్చాక బోరు బావుల మోటర్ల మెకానిక్లు మాత్రమే బాగుపడ్డారని ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. గజ్వేల్ లో కాంగ్రెస్ నేతలు వసూళ్లకు పాల్పడుతున్నారు. గజ్వేల్‌లో అన్ని మండలాల్లో గులాబీ జెండా ఎగరాలి. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గజ్వేల్. స్థానిక సంస్థల ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దు. సిద్దిపేట జిల్లాపై కాంగ్రెస్ పార్టీ పగపట్టింది. నాయకులు ఎవరు గ్రూపుల జోలికి పోవొద్దు. రిజర్వేషన్లు వచ్చినప్పుడు ఎవరు పోటీలో ఉంటారనేది చర్చించి నిర్ణయం తీసుకుందాం అని ఎమ్మెల్యే హరీష్ రావు నేతలకు సూచించారు. యాసంగికి సంబంధించి సన్న వడ్లకు బోనస్ రాలేదని విమర్శించారు. రుణమాఫీ చేసింది 30 పైసలు అయితే, ఎగ్గొట్టింది 70 పైసలు అని ఎద్దేవా చేశారు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడుతున్నారని హరీశ్‌రావు దుయ్యబట్టారు. ప్రభుత్వ వ్యతిరేక చర్యలను నిలదీయాలని సూచించారు.

## ల్యాండ్ పూలింగ్‌పై వచ్చే కేబినెట్‌లో చర్చిస్తాం

అమరావతి, రెండో విడత ల్యాండ్ పూలింగ్‌పై ఎవరూ అభ్యంతరం చెప్పలేదని.. ల్యాండ్ పూలింగ్‌పై వచ్చే కేబినెట్‌లో చర్చిస్తామని ఆంధ్రప్రదేశ్ పురపాలకశాఖ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. సబ్ కమిటీలో మాట్లాడిన తర్వాత ల్యాండ్ పూలింగ్‌పై ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. అమరావతి క్యాపిటల్ సిటీలో లీగల్, టెక్నీకల్ సమస్యలు అన్ని పరిష్కరించామని తెలిపారు. సోమవారం, అమరావతిలో మంత్రి నారాయణ పర్యటించారు. రాజధానిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మీడియాతో మంత్రి నారాయణ మాట్లాడారు. 360 కిలోమీటర్ల ట్రంక్ రోడ్లకు టెండర్లు పిలిచామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే, మంత్రుల బంగ్లాలు పరిశీలించామని మంత్రి నారాయణ చెప్పారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు 12 టవర్లు కేటాయించామని, మొత్తం 288 అపార్టుమెంట్లు అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఆలిండియా సర్వీస్ అధికారులకు ఆరు టవర్ల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్ దాదాపు పూర్తయిందని, నాన్ గెజిటెడ్ అధికారుల టవర్ల నిర్మాణం కూడా దాదాపు పూర్తయిందని వెల్లడించారు. హ్యాపీనెస్ట్‌లో ఆరు టవర్లు ఏర్పాటు- అవుతున్నాయని వివరించారు. వచ్చే మార్చి 31వ తేదీ లోపు ఆయా నిర్మాణాలు పూర్తి కావాలని అధికారులని ఆదేశించారు మంత్రి నారాయణ. ఆలిండియా సర్వీసు అధికారుల టవర్లు ఈ ఏడాది డిసెంబర్‌లోగా పూర్తి అవుతాయని, ఐకానిక్ టవర్ డిజైన్‌లు కూడా దాదాపు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. నార్మన్ ఫోస్టర్ బృందం అమరావతికి వస్తారని.. వారితో ఐకానిక్ టవర్ డిజైన్లపై చర్చిస్తామని తెలిపారు. 75 కంపెనీలకు భూ కేటాయింపు జరిగిందని, డిసెంబర్ చివరిలోగా అన్ని పనులని పూర్తి చేసి ప్రారంభిస్తామని చెప్పారు. గత జగన్ ప్రభుత్వం రైతులు, కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టిందని మంత్రి నారాయణ విమర్శించారు. అమరావతి రాజధాని అభివృద్ధి పనులపై మంత్రి నారాయణ తాజా సమీక్ష నిర్వహించి కీలక ప్రకటనలు చేశారు. నగర నిర్మాణంలో భాగంగా ఇప్పటికే అనేక నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నట్లు- తెలిపారు. ముఖ్యంగా ఎమ్మెల్యేలు, మంత్రుల నివాసాలతో పాటు- అధికారుల నివాసాల నిర్మాణంపై స్పష్టత ఇచ్చారు. ఇందులో భాగంగా.. రాజధాని ప్రాజెక్టులో కీలకమైన ట్రంక్ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ముందడుగు వేసింది. మొత్తం 360 కిలోమీటర్ల రహదారులకు టెండర్లు పిలవడం జరిగిందని మంత్రి వెల్లడించారు. అలాగే ఎమ్మెల్యేలు, మంత్రుల బంగళాలను పరిశీలించినట్లు- నారాయణ తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు 12 టవర్లు, మొత్తం 288 అపార్టుమెంట్లు- నిర్మిస్తున్నామని వెల్లడించారు. ఆలిండియా సర్వీసు అధికారుల కోసం నిర్మిస్తున్న టవర్లను ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరులోగా పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించామని మంత్రి వెల్లడించారు. అలాగే ఐకానిక్ టవర్ డిజైన్‌లు పూర్తయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో రైతులు, కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడ్డారని మంత్రి విమర్శించారు. రెండో విడత ల్యాండ్ పూలింగ్‌పై ఎలాంటి అభ్యంతరాలు రావడం లేదని పేర్కొన్నారు. ఇక సబ్‌కమిటీ చర్చల అనంతరం క్యాబినెట్‌లో ల్యాండ్ పూలింగ్ అంశాన్ని తీసుకువస్తామని తెలిపారు.

## ఆగస్ట్ 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు

అమరావతి,ఆగస్టు 15 నుంచి మహిళలకు బస్సుల్లో జీరో ఫేర్ టికెట్ ఇవ్వాలని సంబంధిత అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంపై సోమవారం సీఎం సమీక్ష నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఏ రాష్ట్రాలకు ఎంత భారం అనే అంశంపై చర్చించారు. ఉచిత ప్రయాణంతో లబ్ధి, 100 శాతం రాయితీ వివరాలను మహిళలకు ఇచ్చే జీరో ఫేర్ టికెట్‌లో పొందుపర్చాలన్నారు. ఈ పథకం ఆర్టీసీకి భారం కాకుండా ఆదాయ మార్గాలు అన్వేషించాలని సూచించారు. నిర్వహణ వ్యయం తగ్గింపుతో సంస్థను లాభాల బాట పట్టించాలన్నారు. లాభాల ఆర్జన విధానాలు, మార్గాలపై కార్యాచరణ రూపొందించాలి. రాష్ట్రంలో ఇకపై ఏసీ ఎలక్ట్రిక్ బస్సులే కొనుగోలు చేయాలని సూచించారు. . ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్‌గా మారిస్తే నిర్వహణ వ్యయం తగ్గుతుంది. ఇందుకు అవసరమయ్యే విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలి. అన్ని ఆర్టీసీ డిపోల్లో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు-పై అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. అయితే ఉచిత బస్సులను కేవలం జిల్లా ప్రయాణాలకే పరిమితం చేశారు. సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఉచిత బస్సు సౌకర్యాన్నిప్రకటించారు.


# ఏపీ రాజకీయాల్లో లేడీ సింగాలు.. ప్లస్సా.. మైనస్సా..!



అమరావతి,రాజకీయాల్లో ఫైర్ ఉండాల్సిందే. నాయకులు ఫైర్ బ్రాండ్లుగా గుర్తింపు తెచ్చుకోవాల్సిందే. ఇది ఇప్పుడే కాదు.. కొన్నాళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్నదే. అయితే.. ఈ ఫైర్ వ్యక్తిగతంగా నాయకులకు, పార్టీలకు మేలు చేస్తే.. మంచిదే. కానీ.. తేడా వస్తే మాత్రం ఇబ్బందే. ఫైర్ బ్రాండ్ రాజకీయాలు నమ్ముకుని.. ఒకరిద్దరు మాత్రమే రాజకీయాల్లో పైకి వచ్చిన ఉదంతాలు మనకు కనిపిస్తాయి. ఉదాహరణకు నన్నపనేని రాజకుమారి. ప్రస్తుత రాజకీయంగా ఆమె కనిపించకపోయినా.. టీడీపీ తరపున బలమైన గళం వినిపించారు.అయితే.. ఎక్కడా వివాదాలకు దారితీయకుండా నన్నపనేని వ్యవహరించారు. దీంతో ఆమె దూకుడు రాజ కీయం పార్టీకి, వ్యక్తిగతంగా ఆమెకు కూడా మేలు చేసింది. ఇక, వైసీపీ నాయకుల విషయానికి వస్తే.. ఫైర్ బ్రాండ్ లేడీ నాయకుల్లో ఆర్కే రోజా ముందుంటారు. కానీ, ఆమెకు మిశ్రమ ఫలితాన్ని మాత్రమే ఈ తరహా రాజకీయాలు కట్టబెట్టాయి. సొంత పార్టీలోనే ఆమెతో విభేదించిన వారు ఉన్నారు. సో.. ఫైర్ బ్రాండ్ రాజకీయాలు చేయాలని ఉన్నా.. చేసినా కూడా.. వాటి వల్ల నష్టం లేకుండా రాకుండా చూసుకోవాలి.ప్రస్తుతం టీడీపీలో ఇదే తరహా చర్చ సాగుతోంది. కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవీరెడ్డి ప్రతి విషయం పైనా ఫైరైపోతున్నారు. తన మన అనే తేడా లేకుండా.. ఆమె రెచ్చిపోతున్నారు. అధికారుల నుంచి నాయ కుల వరకు తీవ్రస్థాయిలో ఆమె వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇక, వైసీపీ నాయకులకు అయితే.. కంటిపై కును కు లేకుండా చేస్తున్నారు. కానీ.. దీనివల్ల మాధవి సంపాయించుకున్న ప్లస్సుల కంటే మైనస్సులే ఎక్కు వగా కనిపిస్తున్నాయని పార్టీ నాయకులు చెబుతున్నారు. మరి ఆమె ఒకసారి పునరాలోచన చేసుకోవాలి.ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వ్యవహారం కూడా దాదాపు ఇలానే ఉంది. ఆమె కూడా ఫైర్ బ్రాండ్ ముద్ర వేసుకున్నారు. కానీ, ఇది పార్టీలో ఆమెను నాయకులకు దూరంగా ఉంచుతోంది. అంతేకాదు.. సమస్యలు చెప్పుకొనేందుకు వచ్చేవారి సంఖ్య కూడా తగ్గుతోంది. ప్రత్యర్థి పక్షంవైపు ప్రజలు మొగ్గు చూపుతు న్నారు. దీనికి కారణం.. ప్రతి దానికీ చిర్రుబుర్రులు ఆడడమే. ఈ నేపథ్యంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా ఆమె మరోసారి విజయం దక్కించుకోవాలంటే.. ఒకింత తగ్గిఉండాల్సిందేనని అంటున్నారు సొంత నేతలు. సో.. లేడీ సింగాలుగా గుర్తింపు మంచిదే అయినా.. రాజకీయాల్లో ఆచితూచి అడుగులు వేయాల్సి ఉంటుంది.

# మోదీ రాజీనామా చేస్తే ఖర్గే ప్రధాని!

న్యూఢిల్లీ, ప్రధాని పదవికి నరేంద్రమోదీ రాజీనామా చేస్తే.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దేశ ప్రధాని అయ్యే అవకాశాలు ఉన్నాయని కర్ణాటక ముఖ్యమంత్రి ప్రధాన ఆర్థిక సలహాదారు బసవరాజ్ రాయరెడ్డి సోమవారం (21.07.2025) సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడిన ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్.. 75 ఏళ్లు దాటిన రాజకీయ నాయకులు పదవుల నుంచి స్వచ్ఛందంగా వైదొలగాలని చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన రాయరెడ్డి.. ఆ మేరకు మోదీ రాజీనామా చేస్తే ఎన్డీయే ప్రభుత్వం మెజార్టీ కోల్పోతుందని అన్నారు. ఆ సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. గాంధీ కుటుంబం ఉన్నత స్థాయి పదవులను త్యాగం చేసిన చరిత్రను పరిగణనలోకి తీసుకుంటే ఖర్గే ప్రధాని అయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.'మోదీ దిగిపోతే.. జేడీయూ, టీడీపీ మద్దతు ఉపసంహరించుకునే అవకాశాలు ఉన్నాయి. అప్పుడు కాంగ్రెస్‌కు అవకాశం వస్తుంది. రాహుల్ గాంధీ తొలి, సహజ చాయిస్ అవుతారు. కానీ.. గాంధీ కుటుంబానికి పదవులను త్యాగం చేసిన చరిత్ర ఉన్నది. గతంలో ప్రధాని పదవిని సోనియాగాంధీ త్యజించారు. ఏమో ఎవరికి తెలుసు? ఆశ్చర్యకర సంఘటనలు జరుగుతాయేమో! సీనియర్ నేత ఖర్గే పార్టీకి ఎంతో సేవ చేశారు. ఆయన పీఎం అవుతారేమో!' అని బసవరాజ్ రాయరెడ్డి చెప్పారు.బెళగావిలో జరిగిన స్టేట్ లెజిస్లేచర్ సమావేశంలో సైతం తాను ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశానని ఆయన గుర్తు చేశారు. 'ఖర్గేకు ఈ రోజుతో 83 ఏళ్లు నిండుతాయి.



దేశానికి, సమాజానికి, పార్టీకి ఆయన చేసిన సేవలతో మరే నాయకుడు సరిపోల లేడు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఒకప్పుడు దళితుడు, సీనియర్ నేత ఖర్గేను ప్రధానిని చేస్తారా? అని బీజేపీ నాయకులు చేసిన హేళన నిజం కావచ్చేమోననేది తన ఆశ అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ఖర్గే యాక్టింగ్ ప్రెసిడెంట్ కాదని, శక్తిమంతమైన అధ్యక్షుడని అన్నారు.ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకుంటారని బసవరాజ్ రాయరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సుర్జేవాలా ఇటీవల కర్ణాటక పర్యటనకు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు నియోజకవర్గానికి 50 కోట్లు, ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాల అభివృద్ధికి 25 కోట్లు ఇవ్వాలన్న నిర్ణయానికి సంబంధం లేదని తెలిపారు.

# సంక్షోభంలో అమెరికా కార్పొరేట్ రంగం

వాషింగ్టన్,అమెరికా వలస విధానాల్లో చోటుచేసుకుంటున్న మార్పులు, ముఖ్యంగా గ్రీన్‌కార్డులు, వీసాల జారీలో తలెత్తుతున్న తీవ్ర జాప్యం అక్కడి కార్పొరేట్ రంగాన్ని అతలాకుతలం చేస్తోంది. నైపుణ్యం కలిగిన విదేశీయులపై ఆధారపడిన సంస్థలు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, కీలక ఉద్యోగులను కోల్పోతుండటంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నాయి.

సీఈవో గ్రీన్‌వుడ్ రాజీనామా.. ఒక నిదర్శనం

ఈ జాప్యానికి ప్రత్యక్ష ఉదాహరణగా అమెరికాలోని అతిపెద్ద ట్రాన్సిట్ సంస్థల్లో ఒకటైన మార్టా సీఈవో కొల్లిన్ గ్రీన్‌వుడ్ రాజీనామా చేయాల్సి వచ్చింది. కెనడా పౌరుడైన గ్రీన్‌వుడ్‌కు వర్క్ పర్మిట్ కాలపరిమితి ముగియడం, గ్రీన్‌కార్డు జారీ ఆలస్యం కావడంతో ఆయన పదవిలో కొనసాగలేకపోయారు. 2022లో మార్టా సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన గ్రీన్‌వుడ్, సంస్థ ఆర్థిక ప్రగతికి గణనీయంగా కృషి చేశారు. ఆయన రాజీనామా అక్కడి కార్పొరేట్ సంస్థలు ఎదుర్కొంటున్న తీవ్రతను స్పష్టం చేస్తోంది.

-భారతీయుల దుర్భర పరిస్థితి

ఈ గ్రీన్‌కార్డు జాప్యం భారతీయులపై మరింత తీవ్ర ప్రభావం చూపుతోంది. అమెరికా వలస విభాగం తాజా గణాంకాల ప్రకారం.. ప్రస్తుతం 1.13 కోట్ల ఇమ్మిగ్రేషన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో అధికభాగం భారతీయులవే కావడం గమనార్హం. 2025 రెండో త్రైమాసికంలో కొత్తగా మరో 16 లక్షల దరఖాస్తులు వచ్చి చేరనున్నాయని అంచనా. గత ఏడాదితో పోలిస్తే, ఈ ఏడాది ప్రాసెసింగ్ అయిన దరఖాస్తుల సంఖ్య కూడా తగ్గింది.

-దరఖాస్తుల పెండింగ్ భారం

గ్రీన్‌కార్డుకు సంబంధించిన ఐ-90 ఫారమ్‌ల ప్రాసెసింగ్‌లో సాధారణంగా ఉండే 0.8 నెలల వేచిచూడాల్సిన సమయం ప్రస్తుతం 8 నెలలకు పెరిగింది. అదేవిధంగా, ఐ-765 (వర్క్ పర్మిట్) ఫారమ్‌ల విషయంలో దాదాపు 2 మిలియన్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సుదీర్ఘ జాప్యాలు అమెరికాలోని



కంపెనీలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి.

-కార్పొరేట్ రంగానికి నష్టాలు

కీలక స్థానాల్లో పనిచేస్తున్న విదేశీయులు ఉద్యోగాలు కోల్పోవడం, వారి స్థానంలో కొత్తవారిని నియమించడంలో జాప్యం, అనుభవజ్ఞులైన ఉద్యోగుల కొరత వంటి అంశాలు సంస్థల పనితీరుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. దీనివల్ల కంపెనీలు ప్రాజెక్టుల పనులలో ఆలస్యం, కస్టమర్ల నమ్మకాన్ని కోల్పోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయి. అంతిమంగా ఇది కంపెనీల ఆదాయాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.ఈ పరిస్థితులను అధిగమించడానికి, అమెరికా ప్రభుత్వం వలస విధానాలను సమీక్షించి, ప్రాసెసింగ్‌ను వేగవంతం చేయడం అత్యవసరం. లక్షలాది మంది నైపుణ్యం కలిగిన వలసదారుల భవిష్యత్తుకు కీలకమైన గ్రీన్‌కార్డు జారీ సమస్యను పరిష్కరించకుంటే, దీని ప్రభావం కేవలం వ్యక్తులకే కాకుండా అమెరికా ఆర్థిక వ్యవస్థపైనే తీవ్రంగా పడే ప్రమాదం ఉంది. ఈ సంక్షోభం నుంచి బయటపడాలంటే వేగవంతమైన, సమర్థవంతమైన చర్యలు తప్పనిసరి.

# బీజేపీలో బ్లాస్ట్! అగ్గిరాజేస్తున్న ఈటల,బండి కామెంట్స్



హైదరాబాద్,భారతీయ జనతా పార్టీలో ఇద్దరు కీలకనేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బీజేపీ నేత బండిసంజయ్ హుజురాబాద్ మాజీ ఎమ్మెల్యే,మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ ల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటుంది. తాజాగా ఈ ఇద్దరూ నేతలు మీడియా ముందుకు వచ్చి ఒకరిపై ఒకరు అసంతృప్తిని వెళ్ళగక్కుతుండటం చర్చగా మారింది. మొన్నటి వరకు అంతర్గతంగా ఉన్న విభేధాలు ఇప్పుడు బహిర్గతమవ్వడంతో ఈ ఎపిసోడ్ ఏటు దారి తీస్తుందోనని కార్యకర్తలలో అందోళన వ్యక్తం అవుతోంది.

హుజురాబాద్‌ను బేస్ చేసుకుని ఈటల, బండి మాటల యుద్ధం

తెలంగాణ బీజేపీ నేతల దృష్టి అంతా హుజురాబాద్ పై ఫోకస్ అవుతుంది. ఒకేసారి బండి సంజయ్. ఈటల రాజేందర్, హుజురాబాద్‌ను బేసె చేసుకుని ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటు ఉండటంతో నేటి రాజకీయాలే కేంద్ర సర్కిల్స్ లో ఉత్కంట రేపుతున్నాయి. కేంద్ర శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సైకిళ్ల పంపిణీలో భాగంగా హుజురాబాద్ కు వెళ్లారు అక్కడే గ్రూపు రాజకీయాల గురించి మాట్లాడారు ఏవరైన గ్రూపులను ప్రోత్సహిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్ రాదని కరాకండిగా చేప్పారు.

హుజురాబాద్ బీజేపీ ఇన్చార్జ్‌గా ఈటల వర్గీయుడి రాజీనామా

సంజయ్ మాట్లాడిన కొన్ని గంటల్లోనే ఈటల వర్గీయుడి హుజురాబాద్ బీజేపీ గో కన్వినర్ గౌతమ్ రెడ్డి పార్టికి రాజీనామా చేశారు. తర్వాత మరో 24 గంటల్లో సమావేశం నిర్వహించుకోని పార్టీల వర్గీయుల శామీర్ పేటలోని ఈటల నివాసానికి తరలి వెళ్లారు. హుజురాబాద్ పరిణామాలు దృష్టిలో పెట్టుకోని బండి సంజయ్ పై ఈటలపై పరోక్షంగా తీవ్ర విమర్శలు చేశారు. 2002లో జిల్లాకు వచ్చారు. మంత్రిగా పనిచేశారు. అడుగుపెట్టని గ్రామం లేదంటూ విమర్శలు గుప్పించారు.

ఈటల వర్గీయులకు ప్రాధాన్యత ఇచ్చామంటున్న సంజయ్ వర్గం

ఈ విమర్శలు తర్వాత సంజయ్ వర్గీయులు ఎలాంటి కామెంట్ చేయలేదు. అయితే హుజురాబాద్ నియోజకవర్గంలో ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చింది ఈటల అనుచరులకే అంటూ కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. మనసులో ఏదో పెట్టుకుని తమను బదానం చేయడం తగదని సంజయ్ తెగ ఫీలైపోతున్నారు. ఈ క్రమంలోనే ఈటల మాట్లాడిన వీడియో టేప్స్ హుజురాబాద్‌లో ఈటల వర్గీయులకు ఎక్కడెక్కడ పార్టీ పదవుల దక్కయో అన్న విషయాన్ని కూడా అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాడానికి రెడి అవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఈలాంటి పరిణామాలు ట్రోల్ చేసుకుంటు ఉండటం కాశాయ శ్రేణులను గందోరగోళ పరుస్తుందట.

ఈ వ్యవహారంపై మాట్లాడవద్దని రాష్ట్ర నాయకత్వం ఆదేశాలు

ఇద్దరు ముఖ్యనేతల రాజకీయ విమర్శలు ఎటూ దారితీస్తాయోనని కార్యకర్తాల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఇప్పటికే ఈ వ్యవహారంపై మాట్లడవద్దని రాష్ట్ర నాయకత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పుడిప్పుడే తెలంగాణలో బీజేపీకి పాజిటివ్ వాతావరణం వస్తుందని రాష్ట్ర నాయకత్వం భావిస్తున్న తరణంలో బండి, ఈటల మధ్య ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనని పార్టీ పెద్దలు కూడా ఆందోళన చెందుతున్నారట. గత కొన్నాళ్లుగా ఈ ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నప్పటికి ఇంత బహిరంగంగా బయట పడకపోవటం చర్చనీయాంశంగా మారింది.

ఉప ఎన్నిక తర్వాత ఈటల, బండి సంజయ్‌ల మధ్య గ్యాప్

హుజురాబాద్ ఉప ఎన్నికల తర్వాత నుంచి రాజేందర్‌కి బండి సంజయ్ గ్యాప్ పెరిగిందంటారు. ఆ క్రమంలో సంజయ్ ను రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవి తొలగించడంలో రాజేందర్ పాత్ర కీలకంగా ఉందని ప్రచారం సాగింది. అప్పటి నుంచి ఈ ఇద్దరు నేతలు ఎడమోహం.. పెడమోహం గానే ఉన్నారు. ఇటీవల రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవుల ఎంపిక సమయంలో రాజేందర్‌కు పదవి దక్కకుండా అడ్డుకున్నారనే ప్రచారం సాగింది. కొన్ని రోజుల పాటు ఈ ఇద్దరు నేతల అనుచరుల పాటు సోషల్ మీడియాలో పెద్ద యుద్దమే నడిచింది. సైలెంట్‌గా ఉండి.. ఉండి.. ఒక్కసారిగా ఇద్దరు నేతలు నోరు విప్పారు. ఈ ఎపీసోడ్ పై అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకంటుందో వేచి చూడాలి.

# తెలంగాణలో బీసీలకు రిజర్వేషన్.. కాకరేపుతున్న రాజకీయం!




హైదరాబాద్,తెలంగాణ రాజకీయాలు గత కొన్నాళ్లుగా బీసీ రిజర్వేషన్ల చుట్టూ తిరుగుతున్నాయి. ప్రభుత్వ పక్షం కాంగ్రెస్.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు రెడీ అయింది. అది కూడా స్థానిక సంస్థల ఎన్నికల నుంచే అమలు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన బిల్లును కూడా అసెంబ్లీలో పాస్ చేసి.. రాష్ట్రపతికి పంపింది. అయితే..అక్కడ నుంచి రిప్లయ్ రాకపోవడంతో గవర్నర్‌కు పంపించి.. ఆర్డినెన్సు ద్వారా అయినా.. ఈ రిజర్వేషన్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. కానీ.. గవర్నర్‌కు పంపించి.. సుమారు వారం రోజులు అయినా.. రాజ్‌భవన్ కూడా మౌనంగా ఉంది.దీనిపై అధికార పార్టీలో చర్చ సాగుతోంది. ఇక, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ దీనిపై ఆచి తూచి వ్యవహరిస్తోంది. బీసీలకు రిజర్వే షన్లు కల్పించాలని బలంగా చెప్పలేక పోతోంది. చెప్పినా.. సర్కారుపై విమర్శలు చేస్తోంది తప్ప.. చిత్తశుద్ధి కనిపించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. దీనికి కారణం పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు బీసీలను పట్టించుకోలేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నా యి. కాంగ్రెస్ ఈ విషయంలో బలంగా ఎదురు దాడి చేస్తోంది. అయితే.. బీఆర్ ఎస్‌లో ఇతర నాయకులు ఎలా ఉన్నా.. ఎమ్మెల్సీ కవిత మాత్రం కొంత జోరుగానే స్పందిస్తున్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో నిరసనగా రైల్ రోకోకు పిలుపునిచ్చినా.. సరైన మద్దతు కొరవడంతో వెనక్కి తగ్గారు.కట్ చేస్తే.. బీజేపీ ఇప్పుడు సంచలన ప్రకటన చేసింది. అసలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు తాము సంపూర్ణంగా వ్యతిరేకమని పార్టీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు ప్రకటించారు. 50 శాతం రిజర్వేషన్లు మించకూడదని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయని.. ఇప్పటికే 10 శాతం రిజర్వేషన్లను ముస్లింలకు కేటాయించారని.. అలాంటప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంటే.. ఇది పక్కా మోసమని.. ప్రజలను మాయ చేస్తున్నారని.. దీనిలో బీజేపీ భాగస్వామ్యం కాబోదని తేల్చి చెప్పారు. ఈ క్రమంలోనే తాము.. దూరంగా ఉంటున్నామన్నారు.అంతేకాదు.. దీనిని షెడ్యూల్ 9(తమిళనాడు మాదిరిగా)లో చేర్చే ప్రసక్తి లేదన్నారు. ఇది రాజకీయ రిజర్వేషన్ల వ్యూహమని.. దీనిలో తాము భాగస్వామ్యం కాబోమని వెల్లడించారు. అయితే.. బీజేపీ చేసిన ప్రకటన రాజకీయంగా ఆ పార్టీని ఇరుకున పెట్టే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే.. తెలంగాణ వ్యాప్తంగా రిజర్వేషన్లకు అనుకూలంగా ఉన్న సమయంలో బీజేపీ ఉన్నట్టుండి ఇలా ప్రకటించడంపై సొంత పార్టీ నాయకులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇది సుదీర్ఘ కాలంలో బీజేపీని ఇబ్బందుల్లోకి నెడుతుందని చెబుతున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# అర్జెంట్ గా పాదయాత్ర! జగన్ వ్యూహం ఏంటి?

అమరావతి,2029 ఎన్నికల ముందు జగన్ పాదయాత్ర చేస్తారని అందరూ అంటున్నారు. జగన్ కూడా యాత్ర పార్ట్-2 ని కన్ఫామ్ చేశారు కూడా. అయితే ఆ యాత్రకు ముహూర్తం ఎప్పుడనేది మాత్రం ఇంకా తేలలేదు. ఇటీవల జరుగుతున్న రాజకీయ పరిణామాలు జగన్ ని పాదయాత్రకు ఫోర్స్ చేస్తున్నాయని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. యాత్రలో ఉండగా అరెస్ట్ అయితే మరింత మైలేజ్ వస్తుందని జగన్ భావిస్తున్నట్టుగా అంచనా వేస్తున్నారు.

పాదయాత్ర..

151 సీట్ల భారీ విజయం తర్వాత ఐదేళ్లలోనే 11 సీట్లకు పడిపోయిన వైసీపీలో అంతర్మథనం మొదలైంది. నవరత్నాల హామీలు అమలు చేసినా, సంక్షేమ పథకాలతో వేలకోట్లు పంచిపెట్టినా వైసీపీ ఎందుకు గెలవలేదనే ప్రశ్నలు మొదలయ్యాయి. అయితే పైకి మాత్రం నెపాన్ని ఈవీఎంలపైకి నెట్టేసినా, లోలోన అసలు కారణాలు అన్వేషిస్తున్నారు నేతలు. అందులో వారికి దొరికిన అతిపెద్ద కారణం జనాలకు జగన్ దూరంగా ఉండటం. జగన్ పాదయాత్ర చేసి ఉంటే కచ్చితంగా ఎన్నికల్లో గెలిచి ఉండేవాళ్లం అనుకుంటున్నారు. ఈ విషయం జగన్ వరకు వెళ్లింది. కార్యకర్తలకు తాను దూరమయ్యానని ఆయన చాలా సందర్భాల్లో చెప్పారు. జగన్ 2.ఓ ఇలా ఉండదని కూడా హామీ ఇచ్చారు. జనం కోసం, కార్యకర్తలకోసం పాదయాత్ర చేస్తానని చెబుతున్నారు జగన్. అయితే ఎన్నికల ఏడాదిలో ఆ యాత్ర ఉంటుందనే అంచనాలున్నాయి. కానీ ఇప్పుడాయాత్ర ముందుకు రాబోతోంది.

ఎందుకు..?

రాజకీయ నాయకులు నిత్యం జనంలో ఉండాలి. అందులోనూ ప్రతిపక్షంలో ఉన్నవారికి ఇది మరీ అవసరం. రాబోయే ఎన్నికల్లో జనం తమని గెలిపించాలంటే ఇప్పట్నుంచే జనంతో మమేకం కావాల్సి ఉంటుంది. ఆ విషయాన్ని అర్థం చేసుకున్నారు కాబట్టే జగన్ పదే పదే ప్రజల్లోకి వెళ్లేందుకు వివిధ కార్యక్రమాలు రూపొందించుకుంటున్నారు. మామిడి రైతులు, పొగాకు రైతులు.. ఇలా పరామర్శలు మొదలు పెట్టారు. కార్యకర్తలను కూడా ప్రత్యేకంగా పరామర్శించేందుకు ఆయన యాత్రలు చేపడుతున్నారు. అయితే ఈ యాత్రలతో కొంతవరకే ప్రయోజనం ఉంటుంది, పైగా ప్రతిసారీ పోలీసుల పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా కాకుండా నిత్యం ప్రజలతో ఉండేందుకు జగన్ ప్రణాళికలు రచిస్తున్నారు. ఒక్కో జిల్లాకు కొంత సమయం కేటాయించి అక్కడి



గ్రామాల్లో పర్యటించబోతున్నారు.

లిక్కర్ స్కామ్ గుబులు..

ప్రతిపక్ష నేతగా వచ్చే ఎన్నికల కోసం సమాయత్తం అవుతున్న జగన్ కి ఇప్పుడు లిక్కర్ స్కామ్ గుబులు పట్టుకుంది. ఆ కేసులో అరెస్ట్ లు మిథున్ రెడ్డి వరకు చేరుకున్నాయి. ఇక మిగిలింది బిగ్ బాసేనంటూ వార్తలొస్తున్నాయి. జగన్ అరెస్ట్ పై సొంత పార్టీ నేతలు కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జగన్ ని అరెస్ట్ చేస్తారేమోనని అంటున్నారు. అయితే జగన్ కూడా ముందునుంచీ అరెస్ట్ లపై నర్మగర్భ వ్యాఖ్యలు చేస్తున్నారు. గతంలో కంటే ఈ ఐదేళ్లు మరింత కఠినంగా ఉంటాయని ఆయన ఫిక్స్ అయ్యారు. అయితే జగన్ బెంగళూరులో ఉంటే అరెస్ట్ చేయడం వేరు, ఆయన జనంలో ఉన్నప్పుడు అరెస్ట్ చేయడం వేరు. జనంలో కలసి ఉంటే అరెస్ట్ తో మైలేజీ మరింత పెరిగే అవకాశముంది. జనంతో మమేకమయ్యే సందర్భంలో రాజకీయ కక్షతో అరెస్ట్ చేశారనే ఆరోపణలు కూడా చేయెచ్చు. అందుకే జగన్ వీలైనంత త్వరగా పాదయాత్ర మొదలు పెడతారనే అంచనాలున్నాయి.

## స్మార్ట్ మీటర్ల బిగింపు దుష్ప్రచారం...

ఒంగోలు,వైకాపా హయాంలో నాసిరకం మద్యం తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన అందరికీ శిక్ష పడుతుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మద్యం కుంభకోణం కేసులో చట్టం తన పని తాను చేస్తోందని చెప్పారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం లేదని మంత్రి స్పష్టం చేశారు. రైతుల వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించబోమని

# టీటీడీలో బైబిల్స్ పంపిణీ.. ఇద్దరు ఉద్యోగులపై చర్యలకు రంగం సిద్ధం!

తిరుమల : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో మరో ఇద్దరు అన్యమత ఉద్యోగుల వ్యవహారంపై పిర్యాదు అందింది. టీటీడీ ఉద్యోగి శేఖర్ ఏకంగా మత ప్రభోదకుడిగా మారారు.మరో ఉద్యోగి కన్నిగ ప్రార్థనా మందిరంలో బైబిల్స్ పంపిణీ చేశారు. ఈ ఇద్దరిపై టీటీడీకి పిర్యాదు అందగా.. అధికారులు చర్యలకు సిద్ధమయ్యారు. ఇప్పటికే 5 మంది అన్యమత ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడినా.. అన్యమత ఉద్యోగుల తీరు మారడం లేదు.తాజాగా అన్యమత ఉద్యోగులపై టీటీడీ వేటు వేసిన విషయం తెలిసిందే. ఇతర మతాలకు చెందిన నలుగురు ఉద్యోగులను టీటీడీ అధికారులు సస్పెండ్ చేశారు. నాణ్యతా విభాగంలో డిప్యూటీ ఇంజినీర్ బీ.ఎలిజర్, బర్డ్ దవాఖానలో స్టాఫ్ నర్సు ఎస్.రోసి, గ్రేడ్-1 ఫార్మాసిస్ట్ ఎం.ప్రేమావతి, ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీలో ఉద్యోగి జీ.అసుంత సస్పెండ్ అయ్యారు. ఈ నలుగురు క్రైస్తవ మతాన్ని అనుసరిస్తున్నట్లు



తేలడంతో టీటీడీ ఈ నిర్ణయం తీసుకుంది. హిందూ ధార్మిక సంస్థలో ఉంటూ.. బాధ్యతారాహిత్యంగా వ్యవహించారని టీటీడీ అధికారులు పేర్కొన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com